ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 20, 2015

ఓ అష్టావధాని

వానల లోగిళ్లు

కలం కదిల్చి...

వారు వెండితెర వేల్పులు. నటనలో, నృత్యంలో ఆరితేరినవారు. ఈ మధ్యే గానంలోనూ తమదైన ముద్రను వేస్తున్నారు. అలాంటి తారలు రచనలోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. ఈ విషయంలో డింపుల్ కపాడియా, రాజేష్ ఖన్నాల గారాల తనయ ట్వింకిల్ ఒకడుగు ముందుందని చెప్పకోవాలి. బాలీవుడ్ కథానాయికగా ఖాన్ త్రయంతో చిత్రాలు చేసినా అక్షయ్ కుమార్‌తో వివాహానంతరం కొంత కాలం ఇంటికే పరిమితమైంది. ఆ తర్వాత గృహాలంకరణను వృత్తిగా చేపట్టింది. అప్పడే ఓ పత్రికవారు ట్వింకిల్‌ను ఏదైనా కాలమ్ రాయమని అడిగారు. ఆ సమాచారమే ఇప్పడు 'మిసెస్ ఫన్నీ బోన్స్' పుస్తక రూపంలో మన ముందుకు వచ్చింది. శిల్పా శెట్టి కూడా ఆరోగ్యం, పోషకాహారంపై పుస్తకం రాయనుంది. ఇక ఇమ్రాన్ హష్మి క్యాన్సర్‌కు సంబంధించి పుస్తకం రాయనున్నాడు. తన కుమారుడు ఆ రాకాసి బారిన పడినప్పడు ఎంతటి వ్యథను అనుభవించాడో స్వయంగా చూశాడు కనక... క్యాన్సర్ రోగులకు, వారి కుటుంబీకులకు అవగాహన కలిగించేలా పుస్తకం రాయాలన్నది హష్మీ మనోభీష్టం. షారూక్ ఖాన్ తక్కువేం కాదు. తన కుమార్తెకు నటనకు సంబంధించిన సూచనలు ఇవ్వాలనుకుంటున్నాడు. అదీ ఓ పుస్తకం ద్వారా. దానికి 'టు సుహానా, ఆన్ యాక్టింగ్, ఫ్రమ్ పప్పా' అని పేరు కూడా పెట్టేశాడు. కల్కి కోచ్‌లిన్ సైతం మహిళలకు సంబంధించిన సున్నితమైన అంశాలను గ్రంథీకరించ నుంది. వీరు కాక... ఇంకెందరు తారల్లో రచనాశక్తి దాగి వుందో మరి! •



ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పండగ ఎప్పుడో...

ఎండలు వానలకే కాదు పండగలకూ సీజన్ వుంటుంది. వినాయక చవితి ముగిసిందంటే చాలు. దసరా, దీపావళి, క్రిస్టమస్, సంక్రాంతి... ఇలా పండగలన్నీ క్యూ కట్టేస్తాయి.

...

పండగ వస్తుందంటే ... అందరిలోకీ వ్యాపారుల ముఖాలే కాదు బుర్రలూ వెలిగిపోతాయి. పండగకు తగ్గ ఆఫర్లతో ఆకట్టుకోడానికి ఎక్కడలేని ఐడియాలు వేసేస్తారు. ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అంటారు. రెండు కొంటే ఒకటి ఉచితం అంటారు. 50 శాతం డిస్కౌంట్ అంటారు. ఏం చెప్పినా బిజినెస్ పెంచుకోడానికే. లాభాల కోసమే.

...

ఆ తర్వాత పండగలను ఆస్వాదించేది పిల్లలే. సెలవులు, కొత్త బట్టలు, పిండి వంటలు, ప్రయాణాలు, ఆటలు వుంటాయి కనక చిన్నారులు ఖుషీ. వాళ్ల కళ్ల ముందర సంతోషంగా తిరగాడుతుంటే పెద్దలూ హ్యాపీ. కాకపోతే ఆ నాలుగు రోజులపాటు పిడుగుల అల్లరిని భరించగలిగితే చాలు.

...

పండగల కోసం ఉత్సుకతతో ఎదురుచూసే వారిలో మహిళామణులు ముందు పీఠిన వుంటారు. తమ పాక శాస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శించడానికిదే అనువైన సమయం మరి. సొంత ప్రయోగాలతో పాటు, టీవీ చానళ్లలో చూపించే కొత్త రకం వంటలను చేసి పెట్టి శభాష్ అనిపించుకోవాలని ఉబలాటపడిపోతారు. అన్నిటినీ మించి పండగకు కొత్త చీరలు కొనుక్కోవడం, వాటిని ఇరుగుపొరుగుకు చూపించుకోవడం...ఓ సరదా.

...

కొత్త జంటలను మరుస్తామా! అయినవారిని చూసుకోవాలని అమ్మాయి, అత్తగారి ఆతిథ్యం స్వీకరించాలని అల్లుడు ఆరాటపడిపోతారు. అందుకే ఆషాఢం పోయి...శ్రావణం ముగిశాక వచ్చే పండగలకోసం కొత్త అల్లుళ్లు ఎంతగానో ఎదురుచూస్తారు. అత్తగారిళ్లకెళ్లి సకల గౌరవ మర్యాదలు పొందడానికి, కోరుకున్న బహుమతులు రాబట్టుకోవడానికి ఇదే కదా సరైన సమయం. కాకపోతే అల్లుడు కూతురు వచ్చిన సందర్భంగా ఘనంగా పిండి వంటలు చేసి వడ్డించడానికి, వారికి కొత్త బట్టలు బహూకరించడానికి అత్తామామలు పడే టెన్షన్ అంతా ఇంతా కాదు. కొత్త జంటకు ఆహ్వానం పలికింది మొదలు అంపకాలు చేసేవరకూ అయ్యే ఖర్చు తలచుకుంటే సగటు జీవుల గుండె వేగం పెరుగుతుంది. అందరూ పండగలను ఆస్వాదించినా పాపం ఆ సామాన్యుడే ఖర్చుకూ, చేతిలో పైకానికి పొంతన కుదరక...అప్పులెవరిస్తారా అన్న ఆలోచనలో పడిపోతాడు. పైకి నవ్వుతున్నా లోపలంతా ఒకటే దిగులే. ఈ కామన్‌మేన్‌కు నిజమైన పండగ ఎప్పుడొస్తుందో!

◆ మనలో మాట



టపా

ప్రతి వారం సురుచులు

మనలో మాట 'ఆకాశంలో ఆ మూడు' చదివాను. రోజువారీ సరకుల ధరలకు రెక్కలు రావడాన్ని వివరించారు. ఒకప్పుడు ఉల్లిపాయని కోస్తే కన్నీరొచ్చేది. పెరుగుతున్న ధరల నియంత్రణకు ఏ ప్రభుత్వాలూ చర్యలు తీసుకోవడం లేదు. కానీ ఉత్తర కుమార ప్రగల్భాలు చాలా పలుకుతున్నాయి. 'కొండంత మనిషి' వ్యాసంలో కృషి ఉంటే మనుషులు రాజారామ్ భాస్కరేలవుతారని నిరూపించారు. కాటన్ మ్యూజియం చదివిన తర్వాత ఓ విషయం చెప్పాలనిపించింది. అప్పటి సంధ్యావందనంలో కాటన్‌దొర గారిని నిత్యం స్మరించే వారట. అందుకే ఆయన జలదాత అయ్యారు. జగ్గయ్య నటుడుగానే కాదు, బెంగాలీ సాహిత్యాన్ని ఆంధ్ర దేశానికి పరిచయం చేసిన వ్యక్తి. మనస్విని ట్రస్ట్ స్థాపించి ఉత్తమ రచయితలను సన్మానించారు. ఎన్నో మంచి పుస్తకాలు ప్రచురించారు. స్నేహ ద్వారా వారం వారం విభిన్న సురుచులు అందుకుంటున్నాం.

- రాఘవేంద్ర శ్రీనివాస్, మచిలీపట్నం.

సూపర్‌మేన్ రాజారామ్

ఈ వారం స్నేహలో ఇచ్చిన ఫీచర్లన్నీ అమోఘం. ఆలోచింపజేసేవి స్ఫూర్తి నింపేవే! 57 ఏళ్ల రాజారామ్ తన గ్రామం కోసం, 7 కొండల్ని తొలిచి, 7 రహదార్లు నిర్మించడం గొప్ప సందేశం. 95 ఏళ్ల యోగా గురు ఖజీమ్, తన శరీర దారుఢ్యానికి అనుసరిస్తున్న జీవన శైలి యువతకు ఆదర్శం. 'మై రోడ్....మై రెస్పాన్సిబిలిటి' అని ప్రజల్లో చైతన్యం నింపి, రహదారిపై మేకులు ఏరి ఉద్యమంలా చేపట్టిన బెనెడిక్ట్ కృషి అభినందనీయం. సత్యాజీగారి సైకిల్ స్టోరీ నుంచి చాలా గ్రహించాం. ఆ వాహనం పుట్టుక, ప్రస్తుతం ఎక్కువగా సైకిల్ వాడుతున్న దేశాల పట్టిక చూసి ఆశ్చర్యపోయాం.

- టి. సత్యనారాయణ, మల్లాపురం, విశాఖ.

సైకిల్ వాలా బావుంది

స్నేహ అనుబంధంలో వచ్చిన వ్యాసాలన్నీ చాలా బాగున్నాయి. 'న్యాయం చేయగలనా!' అంటూ కరీనాకపూర్ చెప్పిన విషయాలు ఆలోచింపచేశాయి. 'నా దారి ..రహదారి అన్న బెనడిక్ట్ జీవకుమార్ నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాలి. 'సైకిల్ వాలా పద...పద....' అనే స్టోరీ నుంచి చాలా గ్రహించాం. సైకిల్ వాడకం వల్ల ప్రయోజనాలు దాని పుట్టుక, ప్రపంచంలో సైకిల్ వాడుతున్న దేశాల పట్టిక, సైకిల్ గురించి వాస్తవాలను తెలియపరిచారు.

- టి. అమల, కర్నూలు.

రంగుల పేజీలు భలే

ఈ వారం రంగుల పేజీలన్నీ చదివించాయి. కరీనా కపూర్ మాటల్లో ఒకటి బాగా నచ్చింది. ఎవరైనాసరే తాము చేస్తున్న పనిని ఆస్వాదించాలన్న మాటలో ఎంతో నిజం వుంది. అదే లేకపోతే ఏ పని చేసినా ఏదో అలా రోజులు నడుస్తాయంతే. ఇక సైకిల్ గురించి ఇచ్చిన అట్టమీది కథ బావుంది. సామాన్యుడి నేస్తంగా ఒక వెలుగు వెలుగుతున్న సైకిల్‌కు సంబంధించిన బోలెడన్ని విషయాలను ప్రస్తావించారు . మలాలా జీవిత కథపై వచ్చిన సమీక్ష చదివాక ...పుస్తకం చదవాలనిపించింది.

- కె. దర్శిత, ఒమ్మెవరం, ప్రకాశం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

వానల లోగిళ్లు

కవర్ స్టోరీ 14

వాన చినుకే ప్రేమలో పడిందేమో అనిపిస్తుంది కొన్ని ప్రాంతాల్ని చూస్తే. నీటి కొలనుల్ని అరచేత పట్టే లోయలు, అడవుల్ని తీగ కట్టిన కొండలు, మబ్బుల్ని ముద్దాడే గ్రామాలు, వన్యప్రాణుల్ని కడుపున దాచుకునే అభయారణ్యాలతో అవి వర్షారవిందాలుగా తోస్తాయి. దేశంలోనే అత్యంత వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలైన వీటిలో ఒక్కో చోట ఒక్కో ప్రత్యేకత కానవస్తుంది. ఎడతెగని వర్షంతో అవి సతమతమవుతున్నట్టు తోచదు. జీవధారను వృథా చేయకుండా గుప్పిట పడుతున్నట్టు అనిపిస్తుంది.

కార్టూన్ పంచ్ 3

జీవితం 4
ఆటలతో వంతెన

ప్రత్యేకం 5
చిట్టి జంటలు

విజేత 6
ఆటో చంద్రన్... కోయంబత్తూర్ టు వెనిస్

నవ్వుల్ పువ్వుల్ 11

సినిమా కబుర్లు 14
భానుమతి ఓ అష్టావధాని

వింత లోకం 16
ఆడవాళ్లకు మాత్రమే

స్ఫూర్తి 17
పెళ్లి వద్దు... చదువుకుంటా...

కథ 18
సాగర మథనం

రుచి 21
మీల్ మేకర్‌తో మరిన్ని...

బాలనేస్తాలు 22
తెల్ల మీసాల కోతి

కవిత్వమ్ 24
అన్నీ నేనే

చూద్దామా -12
రాణి గారి బావి



ఇటీజ్ వెరీ క్లియర్!
RSS కార్యాలయం
చరిత్రను సరిచేసే సమయం వచ్చింది _ వెంకయ్య

కార్టూన్ పంచ్



ఇంకొంచెం ఎత్తు
వడ్డీ ఎంతైనా
పర్వాలేదు!!
వరల్డ్ బ్యాంక్
పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రాల్లో ఏపి నెం:2 -వరల్డ్ బ్యాంక్

ఇక మనబోటి పేదోళ్ళకి ఆ పెద్ద డాక్టరే దిక్కులేయ్!!
కార్పొరేట్ చేతుల్లోకి ప్రజావైద్యం

ఆటలతో వంతెన

సర్కారీ బడులు ఉంటాయి. పిల్లలే కనిపించరు. కష్టపడి ఎన్‌రోల్ చేస్తారు. రిపోర్ట్ పంపేంత సమయం పట్టదు డ్రాపౌట్లకు. మురికివాడల్లో పిల్లలకు అక్షర జ్ఞానం అబ్బాలంటే కట్టాల్సింది కొత్త స్కూళ్లా లేదా వాటికి పంపే బ్రిడ్జ్‌లా ప్రోగ్రామ్. మ్యాథ్యూ కేసీ దగ్గర దీనికి సమాధానం ఉంది. అది ఆటలు, పాటలతో కట్టాల్సిన వంతెన. ఆడుతూ పాడుతూ బడులకు పిల్లల్ని చేర్చాల్సిన వంతెన.



ముంబైలోని ధారవి మురికి వాడల్లో చిన్నారుల జీవితం ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. నేర జీవితానికి పక్కదారులు లెక్కలేనన్ని ఉంటాయి. బడి, ఉద్యోగం, భవిష్యత్తు ఈ అంశాలేవి పట్టకుండా సాగే బాల్యానికి చిరునామా అది. పదేళ్ల కూడా రాని పిల్లలు బీడీలు కాలుస్తూ రోడ్లపై తిరుగుతుంటారు. దారు పలకా బలపం పట్టేలా చేసే వాతావరణమంటూ కనిపించడం అరుదు. ఉద్యోగం పనిమీద దశాబ్దంన్నర క్రితం ముంబైకు చేరిన సైప్రస్‌వాసి మ్యాథ్యూని రెండు ముంబైలు పలకరిస్తుండేవి. డబ్బు ఎలా ఖర్చు చేయాలో తెలీక తికమకపడే బడా జీవితాలు ఒక వైపు. జీవితం ఎందుకు ఉందో తెలీక తలకిందులయ్యే చిన్న జీవితాలు మరోవైపు. ఓ ప్రఖ్యాత ట్రావెల్ కంపెనీలో సీవోవోగా పనిచేస్తున్న ఆయన ముంబై జింఖానా మైదానంలో సహచరులు, మిత్రులతో కలిసి రగ్బీ ఆడుతుండేవాడు. వీరి ఆటను గ్రౌండ్ గోడలను ఎక్కి చూస్తుండేవారు మురికి వాడలకు చెందిన పిల్లలు. అల్లరిచిల్లరగా తిరిగే పిల్లలను కట్టిపడేసే శక్తి క్రీడలకు ఉందనే విషయం అర్థమయ్యింది. తన పలుకుబడిని ఉపయోగించి గ్రౌండ్ బయటే నిలబడిపోయిన పిల్లల్ని వారితో కలిసి ఆడేలా అనుమతి తీసుకున్నాడు. అలా 30 మంది పిల్లల్ని పోగేసి 'ది మెజీషియన్స్ టీమ్' తయారుచేశాడు. మ్యాథ్యూ గ్రౌండ్‌కు వెళ్లడం లేటయ్యేవాడేమో గానీ వారు మాత్రం మైదానంలో అప్పటికే సాధన మొదలెటేసేవారు. ఓ లక్ష్యం అంటూ లేని వీధి బాలలకు అయిన జీవితం ఆటల్నే బడికి పంపడానికి వంతెనగా ఎందుకు ఉపయోగించకూడదనే నిర్ణయానికి వచ్చాడు. ఉద్యోగం వదిలేశాడు. 2001లో ది మ్యాజిక్ బస్ పేరిట కార్యక్రమాల్ని మొదలుపెట్టాడు. ధారవి, ముంబై పోర్ట్ ఏరియాల వద్ద ఉండే మురికివాడలకు బస్సును తీసుకెళ్లి స్థానిక సామాజిక కార్యకర్తల సాయంతో పిల్లల్ని స్పోర్ట్ ఈవెంట్‌లకు తీసుకెళ్లేవాడు. ఆ బస్సును దూరం నుంచి చూడగానే పిల్లల్లో ఎక్కడలేని ఆనందం కనిపించేది. క్రమంగా ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ వంటి ఆటలను వాళ్లకు నేర్పి సాధన చేయించేవాడు.

విరామ సమయంలోనే అసలైన పావును కదిపేవాడు. ఆటల్లో మునిగి మంచి ఉత్సాహంగా ఉన్న పిల్లల్ని చుట్టూ చేర్చుకుని ఆటలో వారికి ఎదురైన సవాళ్లు, వాటిని ఎలా అధిగమించింది చెప్పమనేవాడు. వాటిని నిజ జీవితానికి అన్వయించి వివరించేవాడు. వారంతా బడికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పరిస్థితులు వాటిని ఎలా తప్పించుకోవాలో తెలియపరిచేవాడు. ఇలా వారిలో చిన్నగా మార్పును ప్రవేశపెట్టేవాడు. ఇలా కొన్ని సెషన్లు గడిచాక, వారి ప్రవర్తన తీరులో మార్పు తెచ్చే కొత్త ఆటలను కనిపెట్టి పోటీలు పెట్టేవాడు. నాయకత్వ లక్షణాలు, జట్టు ఐక్యత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందించే ఆట తీరుతో వారిలో మార్పు స్పష్టంగా కనిపించేది. చేతులు శుభ్రపరచుకోవడం, ఆరోగ్యకర దినచర్య మొదలుకొని లింగ వివక్ష, గృహ హింస వంటి అంశాలపై అవగాహన కలిగించేవాడు. ది మెజీషియన్స్ జట్టు సభ్యులకు తన రిఫరెన్స్ ద్వారా ఉద్యోగాలు ఇప్పించిన మ్యాథ్యూకి అనుకోని దెబ్బ తగిలింది. 30 మందిలో ఏ ఒక్కరు కూడా ఉద్యోగాలను సరిగ్గా చేయలేకపోయారు. సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్, ఇంగ్లీష్‌లో మెళకువలు లేకపోవడంతో పాటు క్రమశిక్షణ లేకపోవడం, ఉద్యోగ నిర్వహణ తెలియకపోవడమే కారణాలు. ఈ అంశాలపై కనెక్ట్ ప్రోగ్రామ్ ద్వారా తర్ఫీదునిచ్చాడు.

క్లియర్‌ట్రిప్.కామ్ ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రతి పైసా మ్యాజిక్ బస్ లక్ష్యానికే వినియోగించాడు. మ్యాథ్యూకి మరికొందరు తోడవడం శిక్షణ పొందిన పిల్లల్లో చాలా మంది వలంటీర్లుగా ముందుకురావడంతో స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు తన కార్యక్రమాన్ని విస్తరించాడు. విద్యార్థులకు ఆటల రూపంలో సామాజిక చైతన్యాన్ని తెచ్చారు. ఆయన కష్టం ఫలించి స్కూల్ డ్రాపౌట్ల సంఖ్య పడిపోయింది. ఆటలు ఉంటాయని కొత్తవారు చేరడం పెరిగింది. నాయకత్వ లక్షణాలతో విద్యార్థులే ఒకరికొకరు స్ఫూర్తిగా నిలిచారు. దశాబ్దంన్నర ప్రస్థానంలో 22 రాష్ట్రాల్లో 4.5 లక్షల మందికి పైగా చిన్నారులు, పదివేలకు పైగా యువ వలంటీర్లతో మ్యాజిక్ బస్ పెద్ద మాయే చేసింది. ఈ ఏడాది చివరికల్లా 10 లక్షల మంది చిన్నారులను బడి బాట పట్టించాలని లక్ష్యంగా చేసుకున్న మ్యాజిక్ బస్ మంచి ఫలితాల్నే సాధిస్తోంది. కడుపు నింపని ఆటలతో ప్రయోజనం ఏమిటని, ముందు వారికి మంచి బట్టలు తొడగకుండా దుమ్ము కొట్టుకుపోయే ఆటల్లో పడేయడం ఏమిటని ప్రశ్నించేవారికి ఆయన దగ్గర సమాధానం ఉంది. ఆ ఆటలే వారికి ఓ లక్ష్యమంటూ ఏర్పరిచి, తాము దేన్నైనా సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని పెంచి, పోరాడే గుణాన్ని సరైన దిశలో నేర్పి ఇప్పుడు చాలా మంది ప్రొఫెషనల్స్, టీచర్లు, వర్కర్లను తయారుచేశాయి. చదువు అవసరం వంటబట్టించి బడి బాట పట్టించాయి. ముఖ్యంగా పరిపూర్ణమైన వ్యక్తిత్వం, మంచి ప్రవర్తనతో మెరుగైన భావితరాన్ని రూపొందిస్తోంది. వ్యక్తిగతంగా మెరుగైన ఈ మార్పే గొప్ప సమాజ నిర్మాణానికి అతి కీలకం.

ఇటీవలే ఓ వివాహం జరిగింది. ఆ పెళ్లి గురించి ఊరు వాడంతా ఘనంగా చెప్పుకున్నారు. ఆహ్వానమందిన ప్రతి ఒక్కరు హాజరై వధూవరులిద్దరినీ ఆశీర్వదించారు. వారి అన్నా వదినల్ని కూడా కలవందే వేదికను వదలిరాలేదు. ఇది సెలబ్రిటీల పెళ్లేమో అంటే ఏం చెప్పాలి? తమలోని లోపాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా జీవితాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్న మరగుజ్జుల పెళ్లి అని మాత్రం చెప్పగలం.

చిట్టి జంటలు

మహారాష్ట్రలోని దొండైచాకు చెందిన జంటలు ధీరజ్, పూజ, వికాస్, రాఖీ జైన్‌లు. వీరే ఇపుడు వారి ఊరిలో తెగ సందడి చేస్తున్నారు. అంతగా ఈ జంటల్లో ప్రత్యేకత ఏమిటంటే వారంతా మరగుజ్జులే. ధీరజ్, వికాస్ జైన్‌లు అన్నదమ్ములు. ధీరజ్‌కు 2002లోనే వివాహం కాగా వికాస్‌కు ఈ మధ్యే పెళ్లి తంతు ముగిసింది. ఉమ్మడి కుటుంబంగా కలిసి మెలిసి జీవించే ఈ అన్నదమ్ములకు సరైన జీవిత భాగస్వాములు దొరికారు. ఎత్తులోనే కాదు వారిని అర్థం చేసుకుని సంసారాన్ని చక్కగా సాగించడంలో కూడా. ధీరజ్, వికాస్‌ల తల్లిదండ్రులైన కాంతిలాల్ జైన్ (173 సెం.మీ.), లతా బాయ్ (161 సెం.మీ.)లు మంచి పొడగరులే. వీరి సంతానమైన ఈ అన్నదమ్ములు మాత్రం పొట్టిగా పుట్టడానికి కారణం అకోండ్రోప్లేసియా అనే మరగుజ్జు లక్షణమే. నాలుగేళ్ల వరకు మిగతా పిల్లల్లానే పెరిగిన వీరిలో ఎదుగుదల లోపించింది. వికాస్ 121 సెం.మీ., ధీరజ్ 118 సెం.మీ. ఎత్తు వరకు పెరిగి ఆగిపోయారు. చిన్నప్పటి నుంచి ఈ అన్నదమ్ముల్ని తోటి పిల్లలు ఏడిపించేవారు. క్లాస్‌మేట్‌ల తల్లిదండ్రులు ఎగతాళి చేసేవారు. సైకిల్ పందేలు, చెట్లు ఎక్కడాలు వంటి సరదా కోరికలు తీర్చుకునే అవకాశం లేక వారు డిప్రెషన్‌లోకి వెళ్లేవారు. తల్లిదండ్రులతో తమకు రోజు ఎదురయ్యే అవమానాల గురించి చెప్పి బాధపడేవారు. అందరి పిల్లల్లా సాధారణ బాల్యం గడిపే అవకాశం లేక రోజురోజుకు కుంగిపోతున్న వారిని ఊరడించేందుకు ఆత్మవిశ్వాసం నింపేందుకు తండ్రి ఓ మాట పదే పదే చెబుతుండేవాడు. "మీరు చూడటానికి పొట్టిగా, చిన్నగా ఉండొచ్చు కానీ, మీ మనసులు, హృదయాలున్నంత విశాలంగా చాలామందికి ఉండవు. వాటిని చూసి మీరు గర్వపడండి. శరీరం చిన్నదైతేనేం బుర్ర గొప్పగా ఉంది కదా" అన్న తండ్రి మాటలు వారికి ప్రేరణై మంచి చదువు, కెరీర్‌తో పాటు జీవితాన్ని అందించాయి. ఇద్దరూ కామర్స్‌లో పట్టా పుచ్చుకున్నారు. వికాసేమో గృహోపకరణాల వ్యాపారం చేస్తుంటే, ధీరజ్ స్టాక్ బ్రోకింగ్ కంపెనీ పెట్టుకుని ఆ రంగంలో పేరు తెచ్చుకున్నాడు.

కళ్యాణ గంటలు..

వారితో కలసి పార్టీలు, సినిమాల వినోదాలే కాక ఒడిదుడుకులను పంచుకునే మంచి మిత్ర బృందాన్ని పెంచుకున్న అన్నదమ్ములకు ఓ లోటు మాత్రం బాధించేది. అదే పెళ్లి. తమకు తగ్గ వ్యక్తులు దొరుకుతారో లేదోనని సందేహపడేవారు. సంబంధాలు దొరికేవి కావు. ఆ విషయాన్ని పక్కన పెట్టేసే సమయంలో వికాస్ ఓ సారి తమ బంధువుల పెళ్లి వీడియోను చూశాడు. అందులో తనలాగే తక్కువ ఎత్తులో ఉన్న రాఖీని గమనించి, ఆమెకు వివాహమైందో లేదోనని ఆరా తీసి పెళ్లి ప్రస్తావనతో కలిశాడు. ఎత్తు సరిపోవడం కన్నా ఆమెలోని ఎన్నో గొప్ప గుణాలు తెలుసుకునే అదృష్టం కలిగింది వికాస్‌కు. అంత అందమైన మనసున్న వ్యక్తి తనకెపుడూ ఎదురుపడలేదని అర్థం చేసుకున్న వికాస్ వెంటనే పెద్దలందరినీ ఒప్పించి తమ వివాహానికి ముహూర్తం పెట్టించాడు. అలా 2002లో వారి వివాహం ఘనంగా జరిగింది. కానీ సోదరుడు ధీరజ్‌కు మాత్రం ఆ అదృష్టం కాస్త నిదానంగానే ఎదురైంది. పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా పూజతో తొలిచూపులోనే ప్రేమలో పడిపోయాడు ధీరజ్. ఎక్కడ సంబంధం తప్పిపోతుందా అని బాధపడిన అతడు చివరకు ఆమె మనసు గెలిచి వివాహం చేసుకున్నాడు. రాఖీ (106 సెం.మీ.), పూజ (115 సెం.మీ.) ఎత్తులో ఉంటారు. తమ కన్నా తక్కువ ఎత్తులో ఉన్న భార్యలు దొరకడం కలగా ఉంటుందని నవ్వుతూ చెప్పే ఈ అన్నదమ్ములకు మరో మంచి విషయం మరింత ఆనందాన్నిస్తోంది. వికాస్ కొడుకు 11 ఏళ్ల హిమాంశు ఇప్పుడు 131 సెం.మీ. ఎత్తులో ఉన్నాడు. అతడికి ఆర్కాన్‌డ్రోప్లాసియా వచ్చే అవకాశం లేదని రాఖీ గర్భవతిగా ఉన్నపుడే వైద్యులు పరీక్షలు చేసి తేల్చేశారు. ఉమ్మడి కుటుంబంగా పార్టీలకు, ఫంక్షన్లకు వెళ్లే ఈ ఇరుజంటలు ఇప్పుడు వారి బంధు, మిత్ర గణాల్లో సెంటరాఫ్ ఎట్రాక్షన్.

◆ విజేత



ఆటోవాలా అనగానే ఓ సుపరిచిత ఆకారం మదిలో మెదులుతుంది. అది ఫలానా వారిది కాకపోయినా ఆటోవాలాలెవరైనా ఇమిడిపోయేలా వుంటుంది. అయితే ఆటో చంద్రన్ రూటే సపరేటు. అందరి ఆటోవాలాల్లా ఏదో బాడుగ వచ్చినప్పుడు తోలుకోవడం ... మిగతా సమయాల్లో ప్యాసెంజర్ల కోసం ఎదురు చూడ్డం కాదు. ఆ సమయంలో తన ఆలోచనలకు, అనుభవాలకు అక్షర రూపం ఇచ్చాడు. ఆరు పుస్తకాలు రాశాడు. వాటిలో కమ్యూనిస్టు నేతల జీవితం ఆధారంగా రాసినవీ వున్నాయి. రచన పట్ల అతనికున్న శక్తి, ఆసక్తే అతన్ని వెనిస్ ఫెస్టివల్ వరకూ తీసుకెళ్లింది. అయితే చంద్రన్ ప్రయాణం సాఫీగా వుండదు. ఎన్నో మలుపులు, కుదుపులు, ఒళ్లు గగుర్పొడిచే ఘటనలు వున్నాయి.

ఆటో చంద్రన్
కోయంబత్తూర్ టు వెనిస్

ఎం. చంద్రకుమార్. కోయంబత్తూర్‌లో ఆటోవాలా. ఆటో చంద్రన్‌గా స్థానికులకు సుపరిచితమైన పేరు. పెద్దగా చదువుకోకపోయినా యాభై సంవత్సరాల జీవితంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. నడిపేది ఆటో అయినా రాయడమంటే చాలా ఇష్టం. చదవడమన్నా అంతే ఇష్టం. ఎన్నో పుస్తకాలు చదివాడు. రాశాడు. వాటిలో నవలలూ వున్నాయి. అతని తొలి నవల 'లాకప్'. పోలీస్ స్టేషన్లో తను స్వయంగా అనుభవించిన కష్టాలకు ప్రతిరూపమే ఆ పుస్తకం. దీనికంటే ముందు అసలు అతను పోలీస్ లాకప్‌లోకి ఎలా వెళ్లాడో తెలుసుకోవాలి. పదవ తరగతి తప్పిన చిన్నారి చంద్రన్ ఇంటి నుంచి పారిపోయాడు. అక్కడి నుంచి గమ్యం లేని అతని ప్రయాణం ప్రారంభమైంది. ఎన్నో ఊళ్లు తిరిగాడు. కడుపు నింపుకోవడానికి ఎన్నో పనులు చేశాడు. అలా ఇరవయ్యేళ్ల ప్రాయంలో 1983లో ఆంధ్ర ప్రదేశ్ గుంటూరు జిల్లా చేరుకున్నాడు. అక్కడ వీధుల్లో స్నేహితులతో కనిపించిన చంద్రన్‌ను పోలీసులు స్టేషన్‌కు లాక్కెళ్లారు. కారణం లేకుండానే పదమూడు రోజులపాటు లాకప్‌లో వేసి చితకబాదేశారు. ఎందుకు కొడుతున్నారో, తాము చేసిన తప్పేంటో కూడా వారికి తెలీదు. చెప్పలేదు కూడా. చివరకు వారు చెప్పిన నేరం అంగీకరించాక విడిచిపెట్టేశారు. ఆ పదమూడు రోజుల పాటు... ప్రతి రోజు...ప్రతి క్షణం తను అనుభవించిన నరకాన్ని 'లాకప్' నవలగా మలిచాడు. పోలీసుల క్రూరత్వాన్ని చవిచూసిన 26 ఏళ్ల తర్వాత అది పుస్తక రూపంలో బైటి ప్రపంచం ముందుకొచ్చింది. 2006లో 'బెస్ట్ డాక్యుమెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' అవార్డు కూడా అందుకుంది. చంద్రన్ మిత్రుడు తంగవేలన్ గతంలో బాలుమహేంద్ర దగ్గర కొంత కాలం పనిచేశాడు. నిజానికి ఆ నవల రాయమని ప్రోత్సహించింది కూడా అతనే. అతనే ఆ నవలను తమిళ దర్శకుడు వెట్రిమారన్‌కు అందించాడు. అది చదివిన దర్శకుడు వెంటనే చంద్రన్‌కు ఫోన్ చేసి అభినందించడమే కాక నవల ఆధారంగా సినిమా తీద్దామన్నాడు. ఆ మాటలకు చంద్రన్ ఎంతగానో సంతోషపడిపోయాడు. సహజత్వానికి మరింత దగ్గరగా వుండేందుకుగాను సినిమా చిత్రీకరణకు గుంటూరులో చంద్రన్ సంచరించిన వీధులనే ఎంచుకున్నాడు దర్శకుడు. అంతేకాదు! 'కథ– ఆటో చంద్రన్' అని ఇవ్వడం ద్వారా వెండితెర మీద కూడా అతనికి ఇవ్వాల్సిన గౌరవం కల్పించాడు. ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన ఆ చిత్రానికి 'విచారణై' అన్న పేరు ఖాయం చేశారు. తమిళ థ్రిల్లర్ చిత్రంగా త్వరలో దేశవ్యాప్తంగా విడుదల కానుంది. దానికంటే ముందు ఈ నెల నుంచి 12 వరకు వెనిస్‌లో జరిగిన చిత్రోత్సవంలో ప్రదర్శితమైంది. ఈ సినిమా పండుగకు ప్రపంచ నలుమూలల నుంచి 120 దేశాలకు చెందిన 2000 సినిమాలు వస్తే వాటిలో 20 చిత్రాలు



'విచారణై'లో ఓ దృశ్యం

ఎంపికయ్యాయి. వాటిలో వెట్రిమారన్ సినిమా కూడా ఒకటి. 72వ వెనిస్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రం కావడం, ఆటో డ్రైవర్ కథ ఆధారంగా తీసిన సినిమా కావడంతో దీనికి ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. ఆ చిత్రోత్సవంలో పాల్గొనేందుకు ఆహ్వానం కూడా అందింది. సృజన వుండాలేగానీ ఎక్కడైనా, ఎవరైనా రాణిస్తారనడానికి ఆటో చంద్రన్ జీవితమే ఉదాహరణ. ✦



వాన చినుకే ప్రేమలో పడిందేమో అనిపిస్తుంది కొన్ని ప్రాంతాల్ని చూస్తే. నీటి కొలనుల్ని అరచేత పట్టే లోయలు, అడవుల్ని తీగ కట్టిన కొండలు, మబ్బుల్ని ముద్దాడే గ్రామాలు, వన్యప్రాణుల్ని కడుపున దాచుకునే అభయారణ్యాలతో అవి వర్షారవిందాలుగా తోస్తాయి. దేశంలోనే అత్యంత వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలైన వీటిలో ఒక్కో చోట ఒక్కో ప్రత్యేకత కానవస్తుంది. ఎడతెగని వర్షంతో అవి సతమతమవుతున్నట్టు తోచదు. జీవధారను వృథా చేయకుండా గుప్పిట పడుతున్నట్టు అనిపిస్తుంది.

◆ ఫీచర్ డెస్క్

వానల లోగిళ్లు

దేశంలో ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాలు, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాలు వర్షంతో తడిసిముద్దవుతాయి. రుతుపవనాలకు తలుపులు తెరిచే ఇక్కడి ప్రాంతాల్ని మాన్‌సూన్ గేట్ వేలుగా పిలుస్తారు. కేవలం రుతుపవనాలే కాక నైసర్గిక అనుకూలతలు కూడా ఏడాదంతా వర్షం పడిశం పట్టినట్టు చేస్తాయి. మేఘాలు ఎగబాకుతున్నట్టుండే ఎత్తైన కొండల్లో వాటిని మథిస్తున్నట్టుండే లోయలతో వర్షాన్ని పిండేంత వరకు వదలవు. సముద్రం నుంచి వీచే వేడి గాలులకు అడ్డుపడి చినుకు రాల్చే వరకు ఊరుకోవు. రుతుపవనాల వల్ల జూన్ నుంచి అక్టోబర్ వరకు కుండపోత వర్షంతో తలంటు స్నానాలు చేసే ఈ ప్రాంతాలు మిగతా రోజుల్లోను ప్రత్యేక పరిస్థితుల వల్ల ముసురు దుప్పటి కప్పుకుని కనిపిస్తాయి. మాసిన్‌రామ్, చిరపుంజి, అగుంబె, అంబోలి, సితార్‌గంజ్, చాంద్‌బాలి, బుక్సా, నెరియమంగళం, చిన్నకల్లార్ లాంటి ప్రాంతాలపై వర్షం ఎక్కువగా ప్రేమ కురిపిస్తుంది. ఆ ప్రదేశాల్లో ఎప్పుడూ వర్షఛాయలే కనిపిస్తాయి. ఎప్పుడూ జల్లుల్లో తడుస్తూ పచ్చదనంతో చలి కాచుకుంటూ అందమైన ప్రకృతి అరవిందాన్ని విరబూస్తాయివి. ఎప్పుడూ తడారని ప్రాంతాలుగా పేరు తెచ్చుకున్న ఇవి పర్యాటక ప్రాంతాలుగాను విలసిల్లుతున్నాయి. ఎక్కడైనా వర్షం ఒకటేగా, అదే పచ్చదనం, అదే మేఘం తాకిన కొండలేగా అనడానికి లేదు. ఒక్కో చోట ఒక్కో శైలి హరితధామాన్ని పొదువుకుని, ఊహకు కూడా దొరకని ప్రకృతి సౌందర్యాన్ని అద్దుకున్నాయి. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం ఓ ప్రత్యేకతతో సాదర ఆహ్వానం పలుకుతాయి.

పర్యాటకులకు కలల లోకాలైన అవే ప్రాంతాల్లో జీవనం ఎలా ఉంటుంది? అంత వర్ష ఉధృతిని తట్టుకుని ఎలా ఉండగలుగుతున్నారు? ఈ కోణంలో ఆలోచించాలంటే అక్కడ తప్పక విహరించాలి. అక్కడి ఇళ్ల వాకిళ్లలో తొంగిచూడాలి. వీటిల్లో ఆధునికత పట్టని మారుమూల గ్రామాలున్నాయి. ప్రకృతితో జతకట్టి సాగే సమూహాలున్నాయి. పట్టణ వసతులకు గొడుగు పట్టిన ప్రాంతాలున్నాయి. అక్కడక్కడ ఓ కప్పు వెతుక్కుని తలదాచుకున్న జనసందోహాలున్నాయి. వంద మంది దాటని ఊళ్లు కొన్ని, వేలను తాకిన పట్టణాలు కొన్ని. వర్షపు జల్లుల్ని అక్షింతలుగా చల్లుకుంటూ మనిషి జాడ వేస్తోన్న ఈ ప్రాంతాలకు మిమ్మల్ని అక్షరాలతో ఎత్తుకుపోయి అక్కడి బతుకుచిత్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నమే ఈ కథనం.

మాసిన్‌రామ్, చిరపుంజి

మేఘాలయలో విస్తరించిన ఖాసీ కొండల్లోని మాసిన్‌రామ్, చిరపుంజిలు చాలా సమీపాన ఉంటాయి. ప్రపంచంలోనే అత్యంత వర్షపాతం నమోదయ్యే కేంద్రంగా చిరపుంజి నుంచి బిరుదును లాక్కుంది మాసిన్‌రామ్. ఎడతెగని వర్షంతో ఆరు నెలల పాటు ఉక్కిరిబిక్కిరి అయ్యే ఈ ప్రాంతాల్లో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. చెట్ల వేర్లను ఒకదానితో ఒకటి కలిపి వెదురుబొంగుల సాయంతో వంతెనలుగా తీర్చిదిద్దే వింత ఇక్కడ మాత్రమే చూడగలం. ఇవి పూర్తిగా బలపడటానికి ఏళ్లు పడతాయి. అప్పటి వరకు ఎంతో ఓపిగ్గా వీటిని గ్రామస్తులు ముడులు వేస్తుంటారు. అంతా పూర్తయ్యాక వీటిపై ఒకేసారి 20 నుంచి 30 మంది పిల్లలు నిలబడగలిగేంతగా పటిష్టమవుతాయి. పదుల మీటర్ల నుంచి వంద మీటర్ల వరకు ఉన్న ఈ వేరు వంతెనలు చాలా అబ్బురంగా కనిపిస్తాయి. ఇవే అక్కడి గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రజల అభివృద్ధికి కారణమవుతున్నాయి. ఇక్కడ ఆరునెలల పాటు



అగుంబెలో నిత్యం కనిపించే దృశ్యం

వర్షం భీకరంగా కురుస్తుంది. ఎంతలా అంటే చెవులు చిల్లులు పడే శబ్దంతో కుండపోతలా వర్షం ఎడతెగదు. కొన్ని రోజులపాటు సూర్యుడు జాడ కూడా కనిపించదు. ఇంటి వాకిళ్లు పాడైపోవడం సర్వసాధారణం. ఇంటి లోపల మేఘ గర్జన వినబడకుండా ఏర్పాట్లు చేసుకుంటారు. ఇంటి పైకప్పులను ప్రత్యేకమైన గడ్డితో వేస్తారు. అవి పాడవకుండా టార్పాలిన్ పట్టాలు తదితరాలతో కప్పుతారు. మందంగా ఉన్న గడ్డి సౌండ్ ప్రూఫ్‌గా పనిచేస్తుంది. అయినా సీజన్లో ఇంట్లో అరుపులతో మాట్లాడుకోందే పక్కవారికి వినబడదు. ఆరునెలల ధాన్యం, కిరాణా సరుకు, వంట చెరకును ముందుగానే నిల్వ చేసుకుంటారు. వర్షారణ్య ఉత్పత్తులను అమ్మి బతికే వీరి ప్రధాన ఆదాయ వనరు చీపుళ్ల చేసే గడ్డే. ఇక్కడి నుంచే మిగతా ప్రాంతాలకు చీపుళ్ల ఎగుమతి అవుతాయి. క్నప్ అనే తాబేలు ఆకారంలో ఉండే వెదురు గొడుగులు పనులకెళ్లే వారికి రక్షణనిస్తాయి. శరీరాన్ని అంతటినీ కప్పేసే ఈ గొడుగులు లేనిదే అక్కడ ఒక్క పనీ పూర్తవదు. వర్షాకాలంలో ఇళ్లలోనే ఉండిపోయే మహిళలు ఇక్కడి సాంప్రదాయక టార్బాన్ శాలువాలను నేస్తారు. వీటికి మంచి మార్కెట్ ఉంది. చిరపుంజి పర్యాటకంగా ఎంతో అభివృద్ధి సాధించగా మాసిన్‌రామ్ ఇప్పుడిప్పుడే పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. రెండు ప్రాంతాల్ని కలుపుతూ వంతెన కడితే ఆ రెండు ప్రాంతాల మధ్య ఉన్న రికార్డుల వివాదానికి తెరపడుతుంది. షిల్లాంగ్‌కు దగ్గరలో ఉండే ఈ ప్రాంతంలో మాజింబుయిన్ గుహలు సందర్శనీయం. స్టాలగ్మైట్ రాయి వింతైన ఆకారాల్ని చూడొచ్చు. నోహ్‌కలికై, స్వీట్ జలపాతాలు వేటికవే ప్రత్యేకం.

అగుంబె

దక్షిణ చిరపుంజిగా పిలిచే అగుంబే కర్నాటకలోని షిమోగా జిల్లాలో ఉంది. సహ్యాద్రి పర్వత శ్రేణిలోని మాల్నాడ్, శరావతి లోయల మధ్య ఉండే ఈ ప్రాంతం దట్టమైన అడవులతో నిండి ఉంటుంది. ఎన్నో సుందర జలపాతాలతో నిండిన ఈ ప్రాంతంలో నల్లత్రాచుల ఉనికి ఎక్కువ. కింగ్ కోబ్రాల జన్మస్థలంగా, స్వర్గంలా దీన్ని పిలుస్తారు. ప్రపంచ ప్రఖ్యాత సరీసృప పరిశోధకుడు రోమ్ విటేకర్ ఇక్కడ కింగ్ కోబ్రాలపై పరిశోధన సాగిస్తున్నారు. ఆయన స్థానిక పరిశోధకులతో కలిసి నల్ల తాచుల సంరక్షణ చర్యలకు కృషి చేస్తున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం ఎంత గొప్పగా ఉంటుందంటే విటేకర్ తన దేశాన్ని మరిచేలా చేసి ఇక్కడే కట్టిపడేసింది. కింగ్ కోబ్రాలపై అధ్యయనానికి దీనికి మించిన ప్రదేశం లేదంటారాయన. తాచులతో పాటు ఎన్నో సర్పజాతులకు నెలవు ఈ ప్రాంతం. వైపర్‌లతో పాటు పసరిక పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఎప్పుడు చెలమతో ఉండే ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. భూ మధ్య రేఖకు సమీపంగా ఉండే దక్షిణ భారత్‌లో అత్యంత చల్లనైన ప్రదేశాల్లో ఇది ఒకటి. వర్షారణ్యమే దీనికి కారణం. స్థానికులు ఈ అనుకూల పరిస్థితులకు అలవాటు పడి జీవిస్తున్నారు. అయితే ప్రధాన నివాస ప్రాంతమంతా వర్షారణ్యానికి ఆనుకుని ఉంటుంది. అరణ్యంలో మాత్రం కొన్ని సమూహాలు మాత్రమే కనిపిస్తాయి. వారు కూడా వర్షాకాలంలో ప్రధాన గ్రామంలో తలదాచుకుంటారు. అటవీ ఉత్పత్తులతో పాటు వ్యవసాయాధారిత జీవన విధానం వారిది. రోడ్డుకిరువైపులా పెంకు కప్పుకున్న ఇళ్ల ప్రత్యేక శైలి నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. చినుకుల లోపలికి ప్రవేశించకుండా కట్టుబడి ఉంటుంది. అన్నీ తక్కువ ఎత్తు నిర్మాణాలే. రెండతస్తుల ఇళ్లు అరుదు. ఈ జనావాసాల్లోకి వెచ్చదనం కోసం నల్లతాచులు తరచూ చొరబడుతుంటాయి. వీటిని స్థానికులు దైవంగా కొలుస్తుంటారు. వీటి మనుగడ తేలికవడానికి ఇదే ప్రధాన కారణం.

ప్రాంతం	రాష్ట్రం	వర్షపాతం (సెం.మీ.లలో)
మాసిన్‌రామ్	మేఘాలయ	1187
చిరపుంజి	మేఘాలయ	1087
అగుంబె	కర్నాటక	828
అంబోలి	మహారాష్ట్ర	750
నెరియమంగళం	కేరళ	590
ఇపింగో	అరుణాచలప్రదేశ్	540
బుక్సా	పశ్చిమ బెంగాల్	530
వాల్‌పాయ్	గోవా	410
చిన్నకల్లార్	తమిళనాడు	400
నరేంద్ర నగర్	ఉత్తరాఖండ్	315

అత్యధిక వర్షపాతాన్ని నమోదు చేసే పై ప్రాంతాల్లో ఏడాదంతా కురిసే వర్షపాత వివరాలివి. అయితే వీటి స్థానాలకు సాధారణంగా కురిసే వర్షపాతానికి సంబంధం లేదు. మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాలు వర్షపాత రికార్డుల్లో ఒకదానితో ఒకటి పోటీపడుతుంటాయి. మిగతా ప్రాంతాల్లోను ఇదే సరళి కనిపిస్తుంది. వీటికి దగ్గరలోని మరికొన్ని ప్రాంతాల్లోను వీటికి సమాన స్థాయి వర్షపాతం నమోదవుతుంది.

ఇప్పుడు విటేకర్ మరికొందరి చొరవతో జనావాసాలకు దూరంగా వాటిని విడిచి వస్తున్నారు. ట్రాకింగ్ పరికరాలతో వాటి సంచారాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ప్రమాదాల బారిన పడకుండా కాపాడుతున్నారు. వర్షారణ్య పరిశోధన కేంద్రం (ఎ.ఆర్.ఎఫ్.ఆర్.సి) కూడా ఇక్కడ అటవి మధ్యలో నెలకొంది. ప్రపంచ నలుమూలల నుంచి పరిశోధకులు ఇక్కడికి వస్తారు. వర్షారణ్య ఆధారిత జీవజాలంపై పరిశోధనలు సాగిస్తూ దీని సంరక్షణకు విశేషంగా కృషిచేస్తున్నారు. పర్యాటకులకు ఆశ్రయమిచ్చేందుకు దొడ్డమేను బంగళా ఉంటుంది. బంగళా అంటామే కానీ అది కూడా పెంకు కప్పుకున్న రెండతస్తుల పాత భవనమే.

మేఘాలయ ప్రకృతి వంతెనలు

సితార్‌గంజ్

ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ దగ్గరలోని సితార్‌గంజ్‌లో కూడా వర్షం భారీగానే కురుస్తుంది. అత్యధిక వర్షపాత ప్రాంతాల్లో బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా దీన్ని చెప్పుకోవచ్చు. సమీపంలోని పారిశ్రామిక ప్రాంతం వల్ల ఈ అభివృద్ధి కనిపిస్తుంది. నగర వాతావరణానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఇదే ఇక్కడి ప్రత్యేకత. సమీపంలో అంతా అలముకున్న అటవీ ప్రాంతం. పొగమంచు, ముసురు పట్టినట్టున్నా ఈ ప్రాంతంలో అన్ని పట్టణ సదుపాయాలు ఉంటాయి. ఇక్కడి సిక్కు దేవాలయం నానక్ ముట్టాకు చాలా చరిత్ర ఉంది. దగ్గరలోని నానక్ సాగర్ డ్యామ్ తప్పక చూడాల్సిన ప్రాంతం. కుమాన్ హిమాలయాలకు గేట్‌వేగా సితార్‌గంజ్ ప్రాంతాన్ని గుర్తించారు.

దీన్ని మాల్గుడి కథల టెలీ సీరియల్ ప్రేక్షకులు, అభిమానులు ఇట్టే గుర్తుపట్టేస్తారు. ఎందుకంటే ఆ సీరియల్ ఇక్కడే షూటింగ్ జరుపుకుంది. ఆర్.కె.నారాయణ్ మాల్గుడి కథలకు దృశ్యమాలిక ఈ ప్రాంతం. దూరదర్శన్‌లో ప్రసారమైన ఈ మాల్గుడీ డేస్ నాటిక చాలా భాగం ఇక్కడే చిత్రించారు. ప్రస్తుతం దొడ్డమేనును కస్తూరి అక్క అనే మహిళ చూసుకుంటోంది. పర్యాటకులు, పరిశోధకులకు తక్కువ రుసుముకే వసతి ఏర్పాటు చేస్తారు. ఆమె కుటుంబంతో కలిసి ఉండటంతో అక్కడి వంటకాలను రుచి చేసే భాగ్యం అతిథులకు కలుగుతోంది. మనమెప్పుడూ చూడని ఫలాలు, వేరు కాండాలు, మొక్కల్ని స్థానికులు చిన్నచిన్న బుట్టల్లో పెట్టి అమ్ముతుంటారు. 1900లో 5 వేల మంది జనాభా ఉండేవారు. కానీ, ఇక్కడి దుర్గమ పరిస్థితుల వల్ల క్రమంగా ఆ సంఖ్య నేటికి 500కు పడిపోయింది. చాలామంది పట్టణాలకు వలస వెళ్లిపోయారు. పర్యాటకులకు స్వర్గధామమైన ఈ ప్రదేశం పాము మెలికలు తిరిగే ఘాట్ రోడ్డులు, ఎక్కడో లోయల్లో చెల్లాచెదురుగా కనిపించే గ్రామాలు, ఎటుచూసినా మబ్బుల్ని తాకే కొండలు, భూమిలోకి చొచ్చుకుపోయినట్టుండే లోయలతో ఓ వింతైన ప్రయాణ అనుభూతిని కలిగిస్తుంది ఈ ప్రాంతం. కుంచికల్, బార్కానా, ఒనాకె అబ్బి, జోగి గుండి, కూడ్లు తీర్థం వంటి జలపాతాలు అబ్బురపరుస్తాయి. సూర్యాస్తమయాన్ని కళ్లకద్దుకునేందుకు చాలా మంది పర్యాటకులు వస్తారు. ఆ సమయంలో ఎంతో అద్భుతంగా ఉంటుంది ఈ ప్రాంతం.

చిన్నకల్లార్

తమిళనాడు కోయంబత్తూర్‌కు దగ్గరలోని చిన్నకల్లార్ వాల్‌ప్రాయ్‌కు దగ్గరలో ఉంటుంది. జనసాంద్రత అత్యల్పంగా ఉండే ఈ ప్రాంతంలో స్థానికుల ప్రధాన ఆదాయ వనరు తేయాకు తోటల పెంపకం. కొండ వాలున ఉండే ఈ తోటలు అడవికి చాలా దగ్గరగా ఉంటాయి. చాలా వరకు గ్రామస్తులు చిన్న చిన్న గడ్డి ఇళ్లలో నివసిస్తుంటారు. అవి కూడా కొండ లోయల్లో అక్కడక్కడ చిన్న చిన్న సమూహాలుగా కనిపిస్తుంటాయి. ఆధునిక ఛాయలు అంతంత మాత్రమే. వ్యవసాయం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. అయితే నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఈ దృశ్యం కనిపిస్తుంది. ఆర్గానిక్ ఫార్మింగ్ అనే మాటను వాడకుండానే ఇక్కడ సేద్య పద్ధతులు అవలంబిస్తారు. పోలీసు చెక్‌పోస్టులు, ఓ చిన్న పోస్టాఫీసు కూడా గడ్డి నిర్మాణాలే. ఎక్కడ చూసినా బురదే కనిపిస్తుంది. వర్షాకాలంలో రహదారులపై కూడా చిన్నపాటి వాగుల్లా నీరు కదులుతుంది. చాలా తక్కువ జనాభా. ఎక్కువగా వేరే ప్రాంతాల నుంచే తేయాకు తోటలకు పనులకు వస్తారు. ట్రెక్కింగ్ కోసం వచ్చే పర్యాటకులకు ఖాళీ ఇళ్లే దర్శనమిస్తాయి. ఓ రకంగా వింతైన అనుభవం ఎదురౌతుంది. ప్రతి చోట మనిషి ముద్రకు ప్రతీకగా చెక్క వంతెనల రూపంలో ఏదో ఒక నిర్మాణం కనిపించినా ఒక్కరు కూడా కంటబడరు. ఎన్నో ప్రకృతి అందాలను ప్రోది చేసుకున్న ఈ ప్రాంతంలో ప్రయాణమే ఓ మధురానుభూతిని మిగులుస్తుంది. వాల్‌ప్రాయ్ మీదుగా సాగే మార్గంలో అడుగడుగునా ఓ అపురూపమైన చిత్రం పలకరిస్తుంది. సుదూరాన కనిపించే పరాంబికులమ్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, ఎగువ నిరార్, షోలయార్ డ్యామ్‌లు కనువిందు చేస్తాయి. ఇక్కడి వర్జిన్ లోయలోని ప్రకృతి మనిషి అంటుతగలనిది. అనైమలై కొండల్లో ఉండే దగ్గరి ప్రాంతంలో తేయాకు తోటలు విస్తారంగా కనిపిస్తాయి. దీనికి చేరే ఒక మార్గంలోనే 40 అతి ప్రమాదకరమైన మలుపులు ఎదురవుతాయి. చెక్క వంతెనలు ప్రత్యేక ఆకర్షణ. ఇక్కడ మార్గాలన్నీ ఒకదానితో ఒకటి పోలి ఉంటాయి. గైడ్ లేకుండా అనుకున్న స్థలానికి చేరడం కొద్దిగా కష్టం. ఇక్కడ జలపాతాల నీరు చాలా వడిగా పడుతుంది. సింహ గర్జనలా ఉంటుంది వాటి శబ్దం. ఏనుగుల గుంపులతో ప్రమాదం ఎక్కువ. ఇక్కడ కీకారణ్యంలో ఏ జంతువు ఏ వృక్ష సముదాయం వెనుక దాక్కుందో తెలియదు. చాలా జాగ్రత్తగా ఇక్కడ విహరించాల్సి ఉంటుంది. మిగతా జంతుజాలమూ స్వేచ్ఛగా విహరిస్తాయి.

చిన్నకల్లార్ తేయాకు కూలీలు

నెరియమంగళం

ఇండియా మున్నార్‌కు గేట్‌వేగా నెరియమంగళాన్ని పిలుస్తారు. కేరళలోని ఎర్నాకుళంలో ఉండే ఈ ప్రాంతం ఆ రాష్ట్రంలో అత్యధిక వర్షపాతాన్ని నమోదు చేసే చోటు. కొండల పక్క నుంచి పెరియార్ నది ప్రవహిస్తుంది. దక్షిణ భారత్‌లో తొలిసారిగా ఇక్కడే ఆర్చ్ బ్రిడ్జిని ఇక్కడే కట్టారు. 1935లోనే కట్టిన ఈ వంతెనే ఇప్పటికీ అక్కడి ఎత్తు ప్రాంతాలకు అనుసంధానం చేస్తుంది. రాణి ఝాన్సీ లక్ష్మీబాయ్ నిర్మించిన రాణి కల్లు కట్టడం కూడా ఇక్కడ ఉంది. చిన్నపాటి టౌన్ వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది. 16 వేలకు

మాసిన్‌రామ్ పంట భూములు

ఒడిశా గిరిజన మహిళలు

చాంద్‌బాలి నదీ పరీవాహకం

బుక్సా

పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్ గిరిలో ఉంటుంది బుక్సా. బెంగాల్ పులుల అభయారణ్య ప్రాంతం లోనిది ఈ గ్రామం. అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో అత్యధిక వెనుకబడిన ప్రాంతంగా దీన్ని చెబు తారు. దానికి తగ్గట్టే స్థానికుల జీవనం ఉంటుంది. కేవలం అడవిని మాత్రమే నమ్ముకుని బతికే సంచార జాతి అయిన దుప్కాలు ఇక్కడ నివాసముంటారు. ఆధునికతకు చాలా దూరంలో వీరి జీవనశైలి ఉంటుంది. భారీ చెక్క ఇళ్లలో వీరు ప్రస్తుతం నివాసాల్ని ఏర్పాటుచేసుకుని బుక్సాలోనే జీవిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి 12 మంది పిల్లల వరకు కనిపించే ఈ తెగలు ఇక్కడి అటవీ ప్రాంతంలో హాయిగా జీవిస్తున్నాయి. మహిళలు పసుపు రంగులో కనిపించే వనమూలికల సారాన్ని ముఖానికి పట్టించి సూర్యరశ్మి తగిలేలా కూర్చుంటారు. పళ్లను రంపపు వరసలా చెక్కుకుంటారు. పేరుకు ఆటవిక జాతిలానే తోచినా తాత్వికంగా కనిపిస్తారు. ప్రకృతితో పెనవేసుకుపోయి మనసును ఐక్యం చేస్తారు. ప్రశాంతంగా కనిపించే ఇక్కడి వాతావరణం పర్యాటకంగానూ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. అయితే దుప్కాల జీవనానికి ఆటంకం లేకుండా కొన్ని స్వచ్ఛంద సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. తప్పక చూడాల్సిన ప్రాంతమైన బుక్సా రంగురంగుల సీతాకోకచిలుకలతో అబ్బురపరుస్తుంది. వనమూలికలు కూడా ఎక్కువగా లభిస్తాయి.

పైగా జనాభా ఉంటుంది. జవహర్ నవోదయ పాఠశాల కూడా ఉంది. ఇక్కడి ప్రజలు వ్యవసాయ ప్రధాన వృత్తులు చేస్తుంటారు. అక్కడి ప్రకృతికి సరితూగేలా ఉంటుంది వారి జీవనశైలి. ఇళ్లు పెద్ద పెరళ్లతో చాలా అందంగా ఉంటాయి. పలు రకాల పూలు, కూరగాయలను ఇళ్లలోనే పెంచుకుంటారు. అయితే ఎప్పుడు ముసురు పట్టినట్టు ఉండకపోవడం ఒక అనుకూలత. దట్టమైన అటవీ ప్రాంతంలోను వేరే ప్రాంతాలకు కలిపే దారులు ఉంటాయి. ఇక్కడ ప్రధాన ఆకర్షణ చీయప్పర జలపాతం. ఏడు మెట్లుగా జాలువారే ఈ జలపాతం ఆకాశం నుంచి నేలను దిగుతున్నట్టు ఉంటుంది. ఇక్కడి ప్రాంతం ట్రెక్కింగ్‌కు అనుకూలం.

అంబోలి

మహారాష్ట్రలోని బెల్గామ్ నుంచి గోవా జాతీయ రహదారిలో అంబోలిని చేరుకోవచ్చు. ప్రకృతిలోకి మార్గం వేసిన ఈ జాతీయ రహదారి ప్రయాణాన్ని పరిపూర్ణం చేస్తుంది అంబోలి. ఇక్కడి జీవనం చాలా నింపాదిగా కదలాడుతున్నట్టు కనిపిస్తుంది. ఓ ప్రధాన రహదారి కూడా ఉంది. అందమైన చిత్తరువులా ఊరు కనిపిస్తుంది. ఓ స్వచ్ఛమైన పల్లెటూరిని చూడాలంటే అదీ మనోహరమైన కొండల మాటున, పచ్చని అడవి కిందున అంబోలి గ్రామంలో కచ్చితంగా ఆగాల్సిందే. వ్యవసాయాధారిత జీవన విధానంలోని అద్భుతం ఇక్కడ సాక్షాత్కరిస్తుంది. అక్కడక్కడ విసిరేసినట్టుండే ఇళ్లు, విశాలమైన వాకిళ్లు, పాడి సంపద, గడ్డివాములు.. దట్టమైన అడవి బ్యాక్‌గ్రౌండ్‌లో, పొగమంచులా పరుచుకునే ముసురు బ్యాక్‌డ్రాప్‌లో ఫొటోగ్రాఫర్లకు జీవితానికో తాజా రోజును బహుమతిగా ఇస్తుంది. ఆధునికత మకిలి మింగని బతుకులు గ్రామస్తులవి. వందల ఏళ్ల గ్రామజీవనాన్ని వెనక్కు మళ్లిస్తే ఎలా ఉంటుందో అలా ఇక్కడ కాలం నిలిచిపోతుంది. ఆ ప్రాంతాన్ని సందర్శించేవారు గ్రామంలోకి వెళ్లే భాగ్యాన్ని అస్సలు వదలకూడదు. ఎందుకంటే జీవితాంతం వదలని జ్ఞాపకాలు ఆ విహారం నుంచి వెంటవస్తాయి. సహ్యాద్రి శ్రేణుల్లో విలాసాన్ని ఒలికే ఈ ప్రాంతం జలపాతాల స్వర్గధామం. ఘాట్ల వెంటే చాలా చిన్నచిన్న జలపాతాలు పారుతుంటాయి. ఇక్కడ అడుగిడగానే ఎదురయ్యే అనుభూతి... చుట్టూ ఎటుచూసినా పొగమంచు తప్ప మరేమి కనిపించదు. ఒక్కసారిగా మబ్బులు అలముకుని చీకట్లు కమ్ముకోవడం ఇక్కడ సర్వసాధారణం. లెక్కలేనన్ని జలపాతాలున్న ఈ ప్రాంతంలో ఆర్కిడ్ పూలు మనల్ని సమ్మోహితుల్ని చేస్తాయి. పచ్చగా మెరిసే నాచు చెట్లను కూడా వదలదు. వర్షంలో తడిసి ముద్దయి జలుబు చేసినట్టుంటుంది ఇక్కడి ప్రకృతి. ఫొటోగ్రఫీకి చాలా అనువైన ప్రాంతం. హిరణ్యకోశీ వద్ద చేపల వేట కాలం తెలీకుండా చేస్తుంది. ఇక్కడ ఇబ్బంది ఏమిటంటే సందర్శనకు వచ్చే తాగుబోతుల తగాదాలు ఎక్కువ. గ్రూపులుగా వచ్చి క్యాంపుల్లో మద్యాన్ని సేవించి అల్లరి చేసే పోకిరీలు ఎక్కువ. పోలీసుల నిఘా ఇప్పుడిప్పుడే పెరుగుతోంది.

చాంద్‌బాలి

ఒడిశాలోని భద్రక్ గిరిజన తెగలకు ఆలవాలం చాంద్‌బాలి. వైతరణీ నదీ భితన్‌కణిక జలమార్గాలతో ఉండే ఈ ప్రాంతం మనకు తెలియని మరో ఒడిశాను పరిచయం చేస్తుంది. చాంద్‌బాలిని బ్రిటిషర్లు నదీపోర్టుగా అభివృద్ధి చేయడంతో కొంచెం ఆధునికత ఛాయలు కనిపిస్తాయి. ఆధునిక కట్టడాలతో కనిపించే ప్రాంతంలో అస్సలు నాగరికత ఒంటబట్టని గిరిజనుల సందడి కనిపిస్తుంది. అటవీ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువస్తారు. చేపల వేట ప్రధానంగా సాగిస్తారు స్థానికులు. ఇక్కడి భద్రక్ తెగలు నది వెంట గ్రామాల్ని ఏర్పాటు చేసుకుని ఉంటాయి. వారి ప్రయాణాలు జలమార్గాల్లోనే ఎక్కువగా సాగుతాయి. ఉప్పు నీటి మొసళ్లకు అభయ ప్రాంతమిది. అప్పుడప్పుడూ కాలువలను దాటి గ్రామ రహదారుల మీదకు కూడా అవి రావడం కనిపిస్తుంటుంది. ఇక్కడి మడ అడవులు సందర్శనీయమైనవి. వైతరణీ నదీపాయల్లో సాగే మోటార్ బోటు ప్రయాణాలు మరిచిపోలేని జ్ఞాపకాల్ని అందిస్తాయి. నదీపాయల్లో నీరు నల్లగా ఉండి రాత్రుళ్లు నక్షత్రాలను అద్దుకున్నట్టుగా తోస్తాయి.

ఇలా ఒక్కో అత్యధిక వర్షపాత ప్రాంతం ఒక్కో ప్రత్యేకత, ఒక్కో జీవనశైలితో అద్భుతమైన అనుభూతుల్ని కలిగిస్తుంది. వానజడిలో తడిసిముద్దయ్యే ఈ ప్రాంతాల ప్రకృతి రమణీయతకు మనసు కొట్టుకుపోవడం ఖాయం. వాతావరణ తీవ్ర పరిస్థితులతో మనుగడకు సవాలు విసిరే ప్రాంతాల్లోను జనజీవనం యధేచ్ఛగా సాగిపోతుంది. ఆశ్చర్యంగా, అసహజంగా, దుర్గమంగా అనిపించే ఈ ప్రాంతాల్లో స్థానికులు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవనాన్ని సాగిస్తున్నారు. వారి వల్లే అవి పర్యాటకానికీ అనుకూలంగా మారి సందర్శకులకు మధురానుభూతుల వర్షం కురిపిస్తున్నాయి.

- అనన్య

నవ్వుల్ – పువ్వుల్

కుక్క

పోలీస్ స్టేషన్లోకి ఓ మహిళ కంగారు పడుతూ వచ్చింది.

"ఇన్స్పెక్టర్‌గారూ నిన్న ఉదయం కుక్కను తీసుకుని మా వారు బయటికెళ్లారు...ఇంత వరకూ ఇంటికి రాలేదు... మీరు వెంటనే యాక్షన్ తీసుకోవాలి".

"అయితే మేం ఏం చేయాలి". అసహనంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్

"ఏం చెయ్యమంటారని అడుగుతారేంటి? తీవ్రంగా గాలించి మా కుక్కను ఎక్కడుందో వెతికి పెట్టండి".

ఎక్కడో చూశా !

ఓ యువకుడు బస్టాపులో నుంచున్న యువతిని ఎలాగైన మెప్పించాలని పోజులు కొడుతున్నాడు.

"మిమ్మల్ని చూస్తుంటే ఎక్కడో ఎప్పుడో చూసినట్టు, మీరు నాకు బాగా తెలిసినట్టు అనిపిస్తోంది"

"అయ్యుండచ్చు. నేను పిచ్చాసుపత్రిలో నర్సుని...

హాస్పిటల్

డాక్టర్: మాటపడిపోయిన పేషంట్ పరిస్థితేంటి?

నర్స్: ఇవాళ ఉదయం కొద్దికొద్దిగా మాట్లాడటానికి ప్రయత్నించాడండి!

డాక్టర్: అలాగా...ఏం మాట్లాడాంటి?

నర్స్: ఇంత దరిద్రమైన హాస్పిటల్ నా జన్మలో చూల్లేదన్నాడండీ.

కౌంటర్

తండ్రి: సైకిలంత బరువు లేవు. నీకు సైకిల్ కావాలంట్రా?

కొడుకు: మరి నీకు కారుందిగా నువ్వు కారంత బరువున్నావేంటి?

ద్రాక్షపళ్ళు



ఒక బాతు ఒక జనరల్ స్టోర్‌కి వెళ్ళి ఇలా అడుగుతుంది.

బాతు: ద్రాక్ష పళ్ళున్నాయా!

షాపు ఓనరు: లేవు.ఇక్కడ ద్రాక్షపళ్ళు దొరకవు

రెండో రోజు

బాతు: ద్రాక్షపళ్ళున్నాయా!

షాపు ఓనరు: లేవు, పో అవతలికి

మూడోరోజు

బాతు: ద్రాక్షపళ్ళున్నాయా!

షాపు ఓనరు: లేవన్నానా! పో అవతలికి. ఇంకోసారడిగితే కత్తితో కోసేస్తా!

నాలుగో రోజు

బాతు: కత్తులున్నాయా?

షాపు ఓనరు: లేవు

బాతు: అయితే ద్రాక్ష పళ్ళున్నాయా!

మేకప్

డైరక్టర్: నేను తీయబోయే హారర్ సినిమాలో మీ పాత్ర ప్రేక్షకులను భయపెట్టే విధంగా ఉంటుంది

హీరోయిన్: నాకు ఎలాంటి మేకప్ వేయబోతున్నారు.

డైరెక్టర్: మీరు మేకప్ వేసుకోకపోతే చాలు!!

రాణి గారి బావి

భూమిని తొలచి నీటికి కోవెల కట్టినదే 'రాణి కీ వావ్'. ప్రాణాధారమైన జలం పవిత్రత, స్వచ్ఛతను ప్రతిబింబిస్తూ ఆరాధనాలయంగా రాణి గారి బావిని మలిచిన తీరు అద్భుతంగా అనిపిస్తుంది. తలకిందులుగా ఆలయాన్ని నిర్మించినట్టుండే దీని నిర్మాణ విశేషం మరెక్కడా కనిపించదు. అద్భుత శిల్పంతో అలరారే ఈ భూగర్భ కట్టడం గుజరాత్‌లోని పటాన్‌లో ఉంది. వేయి ఏళ్లనాటి ఈ మెట్ల బావి మనుగడ మూడు దశాబ్దాల క్రితమే వెలుగులోకి వచ్చింది.

ప్రాచీన గుర్జారా శైలి ఆలయ నిర్మాణ సౌష్టవం చాలా ప్రత్యేకమైంది. సరిగ్గా ఆ శైలి నిర్మాణాన్ని తలకిందులుగా చూస్తే ఎలా ఉంటుందో రాణి కీ వావ్ కట్టడం అలా కనిపిస్తుంది. ఈ మధ్యనే 3డి స్కాన్ ద్వారా మోడల్‌ను రూపొందించిన విదేశీ, స్వదేశీ పరిశోధకులు ఈ ప్రత్యేకతను గమనించి నివ్వెరపోయారు. ఇదే మిగతా ప్రాచీన బావుల నిర్మాణ సరళి నుంచి దీన్ని వేరు చేసి ప్రత్యేకంగా నిలిపింది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపునిచ్చింది. గతేడాదే యునెస్కో దీని కళా వైభవానికి పట్టం కట్టింది. సరస్వతీ నదికి సమీపాన నిర్మించిన ఈ కట్టడం వందల ఏళ్ల క్రితమే ఆ నది వరదల్లో మునిగిపోయి కనుమరుగైంది. జైన ముని మెరుంగు సూరి క్రీ.శ.1304లో రచించిన ప్రబంధ చింతామణిలో దీని ప్రస్తావన ఉంది. అద్భుత వాస్తు నిర్మాణం, శిల్ప కళకు సంబంధించిన అంశాల్ని దానిలో ఉదహరించడంతో ఆ బావి వెతుకులాట ముమ్మరమైంది. అనాహిల్‌వాద పటాన్‌ను రాజధానిగా చేసుకుని చాళుక్య (సోలంకి) సంస్థానాన్ని స్థాపించిన మూలరాజు కుమారుడు రాజా భీమదేవ-1 (క్రీ.శ. 1022-1063) జ్ఞాపకార్థం అతడి భార్య రాణి ఉదయమతి దేవి ఈ నిర్మాణాన్ని చేపట్టినట్టు ఆధారాలు లభించాయి. ఊహించని విధంగా సరస్వతీ నది దిశలో మార్పులు చేర్పులు చోటుచేసుకోవడంతోపాటు, ఈ కట్టడం వరద మట్టి కింద కూరుకుపోవడంతో సరైన ప్రాంతాన్ని గుర్తించడంలో పురావస్తు పరిశోధకులకు సవాల్‌గా నిలిచింది. 1980లలో ఎట్టకేలకు బయల్పడింది. ఇలా వందల ఏళ్లుగా వరద మట్టిలో కూరుకుపోయినా దీనిలోని కళా సౌందర్యం చెక్కుచెదరలేదు. పైకప్పు, ఆవలి నిర్మాణాలు మాత్రం వరదకు కొట్టుకుపోయి ఉంటాయని ఊహిస్తున్నారు.

అంతస్తులుగా అమరిక..

తూర్పు అభిముఖంగా నిర్మించిన ఈ కట్టడంలో పశ్చిమ మూలన బావి ఉంటుంది. సర్పిలాకారంలో ఉండే దారి అంతస్తులుగా ఉంటుంది. ప్రాకార గోడంతటా శిల్ప కళా చాతుర్యం కనిపిస్తుంది. ఏడు భాగాలుగా ఉండే మెట్ల వరసలు అనేక భవంతుల గుండా బావి నీటి వద్దకు తీసుకువెళతాయి. పశ్చిమ మూలగా ఉండే బావి 64 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, 27 మీటర్ల లోతు కలిగి ఉంటుంది. నీటి అడుగున సొరంగ మార్గానికి ద్వారం ఉంటుంది. ఇది సమీప గ్రామాలతో పాటు 30 కిలోమీటర్ల దూరంలోని సిద్ధపూర్‌కు దారితీస్తుందని భావిస్తున్నారు. ఇది ప్రస్తుతానికి రాళ్లు, వరద మట్టితో కూరుకుపోయి ఉంది. కట్టడంలోని మిగతా ప్రాంతం కూడా వెలికితీయాల్సి ఉంది. చాలా వరకు మట్టి పేరుకుపోయింది. ప్రస్తుతం కనిపిస్తున్న నిర్మాణాలే ప్రధానమైనవని పరిశోధకుల అంచనా. ఇక్కడ కానవచ్చే విష్ణుమూర్తి దశావతారాల శిల్ప వర్ణనే దీనికి కారణం. ఒక్కో అంతస్తు కిందకు వెళ్లే కొద్దీ ప్రతి అవతారాన్ని వివరిస్తూ విస్తారంగా శిల్ప శ్రేణుల్ని చెక్కారు. మత్స్యావతారంతో మొదలుకుని బుద్ధ అవతారాన్ని కలుపుకుని వీటి వర్ణన విస్తరిస్తుంది. వేయిపడగల శేషనాగు మీద పవళించిన విష్ణుమూర్తి శిల్పంతో వీటి శ్రేణి ముగుస్తుంది. ఇదే ప్రధాన నిర్మాణమని చెప్పేందుకు కారణం ఈ శిల్ప వైభవమే. 800 శిల్పాలతో ఏడు గేలరీల్లో ఇవి రాతితో పటం కట్టినట్టు కానవస్తాయి.

అద్భుత శిల్పచాతుర్యం

మిగతా చోట్ల విష్ణుమూర్తి, ఈశ్వరుడు, మహిషాసుర మర్ధిని మిగతా దేవతా గణాల శిల్పాలు చెక్కినా ఈ నిర్మాణ భాగంలోనే శిల్ప వైచిత్రి పతాక స్థాయిలో కనిపిస్తుంది. 'సోలాహ్ శింగార్' అనే స్త్రీ అలంకరణలోని ప్రతి సూక్ష్మ తేడాను వివరిస్తూ చెక్కిన నాగకన్యల శిల్పాల వరస అద్భుతంగా ఉంటుంది. 16 వేర్వేరు అలంకరణల్లో స్త్రీ అందాన్ని పట్టి చూపుతూ కళా సౌందర్యం కట్టిపడేస్తుంది. వీటిని వీక్షించేందుకు అనుకూలంగా కారిడార్‌లుండేవని శిథిలాలను బట్టి తెలుస్తుంది. వాటికి చేర్చే పెవిలియన్ భవనాలు వివిధ అంతస్తుల్లో నిర్మితమవడం ఇక్కడ మాత్రమే ప్రత్యేకంగా కనిపించే అంశం. బావి ప్రాంతంలో కనిపించే ఓ స్తంభం అక్కడి నిర్మాణ విశేషాన్ని చాటి చెబుతుంది. ఇది ఒక అవశేషమే అయినా దాని డిజైన్ ఆశ్చర్యం కలిగిస్తుంది. జతలుగా ఉండే బ్రాకెట్లు వివిధ గేలరీలను నిలిపి ఉంచుతాయి. వీటిని కూడా అంగుళం వదలకుండా అతి మనోహరంగా చిన్నచిన్న ఆకారాలతో నగిషీలు చెక్కారు. నిర్మాణమంతటా కనిపించే ప్రతి శిల్పం ఎంతో విభిన్న ఆహార్యంతో హావభావాలను పలుకుతుంది. కంఠాభరణాల నుంచి కేశాలంకరణల వరకు ప్రతి చిన్న విషయాన్ని చాలా సృజనాత్మకంగా చెక్కిన తీరు ఆశ్చర్యపరుస్తుంది. వివిధ భంగిమల్లో ఉన్న దేవతా మూర్తులు, జనసామాన్యం, జంతు జాలాలు కనిపిస్తాయి. స్తంభాలు, గోడలు, పైకప్పులు ఇలా ప్రతి చోట కూడా ఏదో ఒక విశేషంతో శిల్ప చతురత కనిపిస్తుంది. రాతి నగిషీలు చూపు తిప్పుకోనివ్వవు. గాలి, వెలుతురులను ప్రసరించే చిన్న చిన్న ద్వారాలకూ అద్భుతమైన నగిషీలు చెక్కారు. అబ్బురపరిచే నిర్మాణ సరళికే పరిమితం కాకుండా ప్రత్యేకంగా నీటి శుద్ధితో పాటు ఆరోగ్య కారకాల చేరికకు ప్రత్యేక ఏర్పాట్లు కచ్చితంగా చేసి ఉంటారని పరిశోధకుల విశ్వాసం. వాడుకలో ఉన్నప్పుడు దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరిగి ఉండొచ్చనేది భావన. అలా ఇక్కడి నీటికి కూడా వైద్య లక్షణాలుండేవని అంటారు. 50 ఏళ్ల క్రితం వరకు ఇక్కడ వనమూలిక మొక్కలు ఎక్కువగా పెరిగేవి. ఇవే దీనికి కారణమని నమ్ముతారు. కానీ, ఇప్పుడు పర్యాటకం విస్తరించి వసతి నిర్మాణాలు ఎక్కువై వాటి జాడ లేకపోవడంతో ఈ ప్రత్యేకత అంతరించింది. క్రీ.పూ. మూడు వేల ఏళ్ల నుంచి అబ్బురపరిచే బావులను నిర్మించిన భారత నిర్మాణ కళ పతాక సన్నివేశంగా రాణీ కీ వావ్‌ను పేర్కొంటారు. కళ్యాణి కట్టడాలకు రాణిగా పిలిచే దీని విశేషాల్ని కళ్లకు కడుతూ ఓపెన్ ఎయిర్ షోను ప్రతి రోజు ప్రదర్శిస్తోంది పర్యాటక శాఖ. పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మ్యూజియం కూడా పక్కనే ఉంది. ఓ మినియేచర్ మోడల్‌ను కూడా రూపొందించే పనిలో ఉంది పురావస్తు శాఖ. ప్రతి ఏటా డిసెంబర్ లేదా జనవరి నెలలో ఉత్సవాల్ని నిర్వహిస్తారు.

జేఏస్పీ



సందర్శన వేళలు

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు

వెళ్లే మార్గం

అహ్మదాబాద్ నుంచి 125 కిలోమీటర్ల రహదారి మార్గం

అహ్మదాబాద్ - పటాన్ రైల్వే మార్గం

అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీప విమానాశ్రయం

సమీప పర్యాటక ప్రాంతాలు

- 100 జైన మందిరాలు
- సహస్రలింగ తలావ్
- పంచసార పరాస్వంత్ ఆలయం
- మొదోరా సూర్య దేవాలయం
- పటోలా పట్టు చీరెలు, బంకమట్టి బొమ్మల కేంద్రం తదితరాలు

3డి మోడల్‌తో భద్రం

3డి స్కానర్‌తో వీటన్నింటినీ డిజిటల్ డాక్యుమెంటేషన్ చేసిన పరిశోధకులకు మరో ఆశ్చర్యకరమైన అంశం కనిపించింది. గోడ భాగాన్ని స్కాన్ చేస్తుండగా శ్వేత వర్ణంలోని అంచులు, అందంగా చెక్కిన మినియేచర్ శిల్పాలు బయటపడ్డాయి. కానీ, సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో మరింత నిర్మాణాన్ని వెలికితేసే విషయం పరిశీలనలోనే ఉంది. ఇప్పటి వరకు 500కు పైగా పెద్ద శిల్పాలు, మరో వేయి చిన్నపాటి శిల్పాలను వెలుగులోకి తేగలిగారు. వాటి తీరును 3డి మోడలింగ్‌తో భద్రపరిచారు. రహస్య సొరంగ మార్గాన్ని బయల్పర్చడం దాదాపు అసాధ్యమైంది. శిథిలాలు అడ్డుపడ్డాయి. భూకంప కేంద్ర ప్రాంతం కూడా. శిల్పాలకే కాక బయల్పడిన మొత్తం నిర్మాణాన్నంతటినీ తెలిపేలా స్కాటిష్ బృందం 3డి మోడల్ రూపొందించింది.

భానుమతి ఓ అష్టావధాని

భానుమతి.. ఈ పేరు చెప్పగానే తెలుగు సినిమాతల్లి ఒళ్ళు పులకరిస్తుంది. ఈమె మా తెలుగు కళా సృష్టి! అని సగర్వంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ చెప్పుకునే స్థాయి భానుమతిది. రచన, సంగీతం, నటన, దర్శకత్వం, నిర్మాణం, నేపథ్య గానం, సాంఘిక సేవా కార్యక్రమాలు, స్టూడియో నిర్వహణ, కళాక్షేత్ర నిర్వహణ అనితర సాధ్యమైన పనులన్నీ అలవోకగా చేసిన వ్యక్తి, మహాశక్తి భానుమతి.

ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలో దొడ్డవరం గ్రామంలో బొమ్మరాజు వెంకటసుబ్బయ్య సరస్వతమ్మ దంపతులకు మూడవ సంతానంగా ఈ కళా సరస్వతి 1925 డిసెంబర్ 24న జన్మించింది. బొమ్మరాజు పేరు మోసిన శాస్త్రీయ సంగీత కళాకారుడు. తల్లి సరస్వతమ్మ అద్భుతంగా పాడేది. వీరి సంతానం భానుమతి ఇక గొప్ప కళాకారిణి కాకుండా ఎలా ఉంటుంది? భానుమతి ఏకసంతాగ్రాహి. ఎంతటి క్లిష్టమైన పాటనైనా ఒకసారి వింటే విన్నది విన్నట్లు పాడేసేది. బాల్యంలో భానుమతి ప్రతిభని చూసి సంభ్రమాశ్చర్యాలల్లో మునిగిపోయిన సందర్భాలు వెంకటసుబ్బయ్య గారికి ఎన్నో ఉన్నవి. అందుకే నిప్పులా పెంచాడు. తనకు నచ్చితే ఎంతటి కష్టమైనా చేసి సాధిస్తుంది. ఎంతటి వారినైనా ఎదిరిస్తుంది.

సినీరంగ ప్రవేశం

దర్శక బ్రహ్మ సి.పుల్లయ్య 'వరవిక్రయం' సినిమా తీస్తున్న రోజులవి. పుష్పవల్లి, లక్ష్మీకాంతం, దైతా గోపాల లాంటి సీనియర్లు నటిస్తున్నారు. అందులో కాళింది పాత్రకి భానుమతిని ఎంపిక చేశారు. భానుమతి పాటా, మాటా, నటనా చూసి పుల్లయ్య గారు దీవించారు. భవిష్యత్తులో గొప్ప నటీమణి అవుతుందని ఆశీర్వదించారు.

ధర్మపత్ని, భక్తిమాల సినిమాల్లో నటిస్తున్నా ఆమెకు మంచిపేరు తెచ్చిన సినిమా, ఆమె జీవితంలో మార్పు తెచ్చిన సినిమా 'కృష్ణ ప్రేమ'గా చెప్పుకోవచ్చు. కృష్ణప్రేమ చిత్రం చేస్తున్నప్పుడే అప్పటి సహాయ దర్శకుడు పి.యస్ రామకృష్ణతో పరిచయమైంది. ఆ పరిచయమే ప్రణయంగా మారి పెళ్ళి దాకా వచ్చింది.

భారతీయ సినిమా చరిత్రలో మొట్టమొదటి మహిళా దర్శకురాలిగా నిలిచింది భానుమతి. చండీరాణి సినిమాలో నటిస్తూనే దర్శకత్వం వహించింది. నిర్మాతగా కూడా వ్యవహరించింది. కత్తి యుద్ధాలు చేసి తెలుగు, తమిళ, హిందీ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచింది. ఈమె నటనకి ముగ్ధుడైన ఆనాటి మహానాయకుడు అన్నాదురై 'నడిప్పుకు ఇలక్కనం' అన్న బిరుదునిచ్చి సత్కరించాడు. అంటే నటనకు భాష్యం భానుమతి అన్నమాట.

అనితర సాధ్యమైన పాత్రలు

స్వర్గసీమ చిత్రంలో చిత్తూరు వి.నాగయ్య సరసన అల్ట్రామాడ్రన్ పాత్రలో నటించింది. మొట్టమొదటిగా గ్లామర్ పాత్రలో స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో కనిపించిన నటి భానుమతే కావచ్చు. తన స్వంత బ్యానర్‌లో 'లైలా మజ్నూ' చిత్రంలో 'లైలా'గా నటించింది. భగ్న ప్రేమికురాలైన లైలా పాత్రకి ప్రాణం పోసింది. ఈ చిత్రంలో భానుమతి మాట, పాట, నటన అనితర సాధ్యం.

ఇక్కడో విషయాన్ని ముచ్చటించాలి. లైలా చిత్రం కోసం వాసన పడకున్నా చేపల బజారు దాటుకుంటూ చెన్నై సారంగపాణి వీధిలో వున్న అక్కినేని ఇంటికి ప్రతిరోజు రిహార్సల్స్‌కు వెళ తుండేది. ఆ రోజుల్లో షూటింగు కంటే రిహార్సల్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. నటనలో పరిపక్వత సాధించడానికి ఎంత కష్టమైన పని చెయ్యడానికైనా సాహసించేది. 'మల్లీశ్వరి' చిత్రం కోసం ఆ చిత్రంలో తన నటన, పాటలు జనరంజకంగా రావడం కోసం అహోరాత్రులు శ్రమించింది. అందుకే 'మల్లీశ్వరి' ఈ నాటికీ తెలుగు వారి క్లాసిక్‌గా నిలిచిపోయింది. ఇక చండీరాణి విషయానికొస్తే కత్తి యుద్ధం చేయడం మొదటిసారే అయినా అనుభవం వున్నట్టు చేసింది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సంచలనం సృష్టించింది ఈ చిత్రం. మరో కళా ఖండం విప్రనారాయణ చిత్రంలో దేవయాని పాత్రకు ప్రాణం పోసింది. మరో చిత్రం 'సారంగధర'లో చిత్రాంగి పాత్ర మరొకరు చెయ్యలేరన్నంతగా నటించింది. మరో అద్భుతమైన కళాఖండం 'బాటసారి'. ఈ చిత్రం నిర్మించడానికి, వితంతు పాత్రలో నటించడానికి గుండె ధైర్యం కావాలి. అక్కినేని జీవితంలో దేవదాసుని మించిన పాత్ర 'బాటసారి' అని ఒప్పుకుంటాడు. పల్నాటి యుద్ధం చిత్రంలో

బాలకృష్ణతో...

ఎన్టీఆర్‌తో...

శివాజీ గణేశన్‌తో...

నాగమ నాయకురాలిగా చేసిన ఆమె బ్రహ్మన్న నాయుడిగా నటించిన ఎన్టీఆర్‌ని డామినేట్ చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. భానుమతి నటించిన మరో అద్భుతమైన చిత్రం 'తోడు-నీడ'. ఇందులో ఎన్టీఆర్ సరసన జమునతో పాటు ప్రధాన కథానాయికగా నటించి ప్రేక్షకుల ఆదరణను నోచుకుంది. ఈ చిత్రంలోనే భానుమతి ఒక ఇంగ్లీషు పాట I was just a little girl, I asked my mother what I will be..ను రసవత్తరంగా పాడింది. ఈ పాట ఆ రోజుల్లో ప్రతి చదువుకున్న వారి నోళ్ళలోనూ నానింది.

ఆపాత మధురాలు

'స్వర్గసీమ'లో ఓహో పావురమా.. 'లైలా-మజ్ను'లో నిను చూసి పోవుదునా.., 'మల్లీశ్వరి'లో అన్ని పాటలూ మనసున మల్లెల మాలలా.., పిలిచినా చిగువటరా.., ఏడ తానున్నాడో బావా.. ఈ పాటలు ప్రపంచంలో ఉన్న ఏ తెలుగు ప్రేక్షకుడైనా మరిచిపోగలడా? విప్రనారాయణ చిత్రంలో ఎందుకోయీ తోటమాలి.., రారా నా స్వామి రారా.., సావిరహే తవదీనా.. మచ్చుకు కొన్ని. 'సారంగధర'లో అడుగడుగో అల్లడుగో, 'మంగమ్మ గారి మనవడు'లో

శ్రీ సూర్యానారాయణ మేలుకో..! ఇలా ఎన్నో ఆపాత మధురాలు. భానుమతిది ఓ వైవిధ్యమైన స్వరం. చౌరాసియా వేణువులా, శాస్త్రీ వీణలా వినిపిస్తుంది, అనిపిస్తుంది అనడం అతిశయోక్తి కాదు.

వ్యక్తిగత జీవితం

భానుమతి లోపలి మనిషి అద్భుతమైంది. అనితర సాధ్యమైంది. కృష్ణ ప్రేమ చిత్రంలో నటిస్తున్నపుడే భానుమతి, రామకృష్ణల మనసులు కలిశాయి. అప్పటికే భానుమతి అగ్ర తార. తన కుటుంబాన్ని సైతం లెక్కచేయకుండా 1943 ఆగష్టు 8న వివాహం చేసుకుంది. ఆమె కొడుకు భరణి పేరిట ఇరవై ఎకరాల్లో స్టూడియో నిర్మాణం చేసింది. స్వంత బ్యానర్ స్థాపించి అద్భుతమైన కళా ఖండాలు తీసింది. కొన్ని చిత్రాలు అపజయం పొందాయి కూడా. ఆమె గెలుపోటములు ఏనాడు పట్టించుకునేది కాదు. చేయాలనిపిస్తే చేసేయడమే. అంతస్తులు చిత్రం కోసం హైద్రాబాద్ షూటింగ్‌కి వచ్చింది. వి.బి.రాజేంద్రప్రసాద్ నిర్మాత, అక్కినేని హీరో. ఆమె కోసం హోటల్లో రూమ్ బుక్ చేసినా ఒప్పుకోలేదు. సారథి స్టూడియోలోనే బస చేసింది. తెల్లారేసరికి ఆమె కాలి వేళ్లను ఎలుక కొరికేసింది. అది చూసిన నిర్మాత షూటింగు క్యాన్సిల్ చేసుకుంటామన్న ఒప్పుకోలేదు. తన మూలంగా ప్రొడ్యూసర్లు నష్టపోకూడదనే భావన ఆమెది. తమిళ హీరోలు భానుమతి పక్కన నటించడానికి భయపడేవాళ్ళు. ఒకసారి శివాజీ, రామచంద్రన్‌లను ఇంటికి పిలిచి ఆత్మీయురాలిగా విందునిచ్చి వారి భయాన్ని పోగొట్టింది. రచన విభాగం ఆమె జీవితంలో ప్రధాన ఘట్టం. ఆమె స్వీయ రచన 'అత్తగారి కథలు' సంచలనం సృష్టించాయి. 'నాలో నేను' ధారావాహిక కేంద్ర సాహిత్య అకాడమీ వారి పురస్కారాన్ని సొంతం చేసుకుంది.

అవార్డులూ, రివార్డులూ

1966లో పద్మశ్రీతో ఆమెను సత్కరించిన కేంద్ర ప్రభుత్వం 2003లో పద్మభూషణ్‌తో గౌరవించింది. అంతస్తులు, పల్నాటి యుద్ధం చిత్రాలకు రాష్ట్రపతి అవార్డులు. ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డు, ఎన్టీఆర్ నేషనల్ అవార్డు దక్కాయి. వీటితో పాటు కళాప్రపూర్ణ, ఆంధ్ర యూనివర్సిటీ వారి గౌరవ డాక్టరేట్ అవార్డులను చేజిక్కుంచుకుంది. ఆమె జీవితంలో స్వచ్ఛంద, సాంస్కృతిక సేవా సంస్థలు అందించిన అవార్డులకు కొదవలేదు.

లోపలి మనిషి

భానుమతిని దగ్గరగా గమనించిన వారికి తెలుస్తుంది. ఆమెది వజ్ర సంకల్పం, భావోద్వేగాలను బహిర్గతం చేస్తుంది. తర్వాత చాలా బాధపడుతుంది. ముక్కు సూటిగా మాట్లాడుతుంది. భానుమతి కోపం తాటాకు మంటలాంటిది. గుప్పున ఎగిసి చప్పున చల్లారిపోతుంది. పేదలన్నా, చదువుకునే వాళ్ళన్నా వల్లమాలిన అభిమానం. అందుకే తన పేరు మీద స్కూలు స్థాపించి ఉచిత విద్యని చెప్పించింది. సాంస్కృతిక కళల పట్ల తనకున్న తృష్ణని చెన్నై కళాక్షేత్రం ద్వారా తీర్చుకుంది. తను బతికినంత కాలం చిరుత పులిలా బతికింది. ఉన్నత చదువుల ఆశ తీరక పోయినా తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాలు బాగా చదివింది. విశ్వనాథ వారికి, దేవులపల్లికి అభిమాన పాత్రురాలు. భర్త మరణం ఆమె జీవితంలో ఊహించని పరిణామం. కష్టాల్లో ఆమె కంటతడి పెట్టడం ఎవరికీ తెలీదు. కానీ, మనసులో ఎంత బాధపడేదో. సంప్రదాయ సొబగులు ఆమె దగ్గరే నేర్చుకోవాలి. సంగీత, సాహిత్య, అభినయ రంగాలు భగవంతుని స్వరూపాలని అంకిత భావంతో పనిచేసింది. భానుమతి భౌతికంగా మరణించినా ఆమె మాటలతో, పాటలతో ఎప్పటికీ మనతోనే ఉంటుంది. అందుకే ఆ కళామతల్లికి కంఠాభరణంగా నిలిచిపోయింది.

ఇమంది రామారావు

9010133844

400 కోట్ల కేక్

ఓ అరబ్ షేక్ గారి గారాలపట్టి పుట్టినరోజు, నిశ్చితార్థం ఒకే రోజు వచ్చాయి. చాలా ప్రత్యే కమైన ఆ రోజు చాలా గొప్పగా ఎలా సెలబ్రేట్ చేయాలనే ఆలోచనలో పడిందా కుటుంబం. అలా చాలా చాలా ఖరీదైన ఆలోచన తట్టింది. ప్రపంచంలోనే అతి ఖరీదైన పెళ్లి దుస్తుల్ని డిజైన్ చేసి నివ్వెరపరచిన డెబ్బీ వింగ్హామ్‌కు వెంటనే లైన్ కలిపారు. అందరూ ఆశ్చర్య పోయేలా కేక్‌ను రూపొందించాలని కోరారు. వెంటనే వారింట వాలిపోయిన డెబ్బీ ఎవరూ ఊహించనట్టు వజ్రఖచిత కేక్ ఐడియా చెప్పింది. ఓ ఫ్యాషన్ షోను పోలే ఆ డిజైన్ వారికి బాగా నచ్చడంతో డబ్బుకు తడుము కోకుండా తలూపారు. ఈ కేక్ తయారీలో సుమారు 300 కోట్ల రూపాయల విలువ చేసే రత్నాలను పొదిగింది. 5.2 క్యారట్ గులాబీ వజ్రం, 6.4 క్యారట్ పసుపు వజ్రం, 5 క్యారట్ 15 శ్వేత వజ్రాలు చాలా ఖరీదైనవి. ఇవి కాక నాలుగు వేలకు పైగా చిన్న వజ్రాలను, పచ్చలను, వైడూర్యాలను కూడా అలంకరించింది. కేవలం కేక్ ర్యాంప్‌వే పైనే 1 క్యారట్ చొప్పున ఉన్న 400 వజ్రాలను, మూడు క్యారట్ ఉన్న 73 తెలుపు వజ్రాలను, 75 నలుపు వజ్రాలను వాడి నోరెళ్లబె ట్టించింది. అయితే అందరికీ ఓ డౌట్ వచ్చింది తమకు వచ్చే కేక్ ముక్కలో ఆ వజ్రాలు దొరికితే ఉంచేసుకోవచ్చా అని. డెబ్బీకి కూడా ఈ విషయం తెలీదేమో. ఓ వైపు ఒక పూట తిండి కోసం సముద్రాలు దాటే ప్రయత్నం చేస్తూ మునిగిపోతున్న కుటుంబాల కన్నీటి కథలు చూస్తుంటే ఇలా కోట్లకు కోట్లు ఓ విందుకు తగలేసి దర్పం ప్రదర్శించడం ఏమిటని చాలామంది తిట్టిపోస్తున్నారు. నిజమే కదా!

వింత లోకం

ఆడవాళ్లకు మాత్రమే

కెన్యాలోని ఉమోజా అనే గ్రామంలో మగాళ్లకు చోటులేదు. కేవలం ఆడవాళ్లకే సొంతమైన ప్రదేశమది. రెబెకా లొలొసోలీ అనే ఆవిడ పాతికేళ్ల క్రితం ఈ గ్రామాన్ని స్థాపించింది. సాంబురు తెగలకు చెందిన స్త్రీలు, ఆడపిల్లల్ని గృహహింస, పురుషాధిక్యత నుంచి కాపాడేందుకే ఇది. స్త్రీలను హింసించే ఆచారాలు, పద్ధతులు ఎక్కువగా ఉన్న పురుషాధిక్య తెగ సాంబురు. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాల్ని, అవమానాల్ని ఎదుర్కున్న రెబెకా మిగతా ఆడవారి రక్షణ కోసం దీన్ని నెలకొల్పారు. అనాథలు, పీడితులు, విధవలు, బలవంతపు పెళ్లిళ్లకు బలైన మహిళలకు ఇక్కడ ఆశ్రయమిస్తారు. 1990 ప్రాంతంలో తన సొంత గ్రామంలో ఓ మహిళను దగ్గరలోని క్యాంపునకు చెందిన బ్రిటిష్ సైనికులు అత్యాచారం చేశారు. దానికి నిరసనగా రెబెకా గళమెత్తితే గ్రామానికి చెందిన పురుషులే తీవ్రంగా కొట్టారు. ఇంత అరాచకం చేస్తున్నా భర్త కూడా మౌనం వహించాడు. 50 ఏళ్లుగా క్యాంపు సైనికుల అత్యాచారాలకు లెక్కేలేదు. మగాళ్లు దీనిపై ఎదురు తిరగక పోగా ఆడవారితో తెగతెంపులు చేసుకునేవాళ్లు. ఈ కిరాతకాలను సహించలేక ఆమె ఉద్యమాన్ని లేవదీసింది. మిగతా బాధితుల్ని ఏకం చేసి గ్రామాన్ని బహిష్కరించి వెళ్లిపోయి ఉమోజా గ్రామాన్ని నెలకొల్పింది. అలా మహిళల కోసమే ఏర్పడిన ఆ గ్రామం బాగా అభివృద్ధి చెందింది. కడుపున పుట్టిన బిడ్డలను అక్కున చేర్చుకుని ఆలనాపాలనా ఇక్కడే చూసుకుంటున్నారు ఉమోజా మహిళలు. సాంప్రదాయక ఆభరణాలు, పర్యాటకం ద్వారా సాధికారత సాధించారు. స్థానిక పురుష ఎంపీకి ఉమోజా గ్రామానికి ప్రత్యేక వెబ్‌సైట్ ఉందనే విషయం కూడా తెలియదు. అసలదేంటో అన్న విషయం అయినా తెలుసోలేదో అని రెబెకా వ్యంగ్య బాణాన్ని నవ్వుతూ వదిలింది.

స్నానానికి బదులుగా స్ప్రే

సబ్బుతో రెండు మూడు సార్లు గట్టిగా తోమందే తానమైనట్టుండదని అనేవాళ్లకు డేవ్ విట్‌లాక్ కొన్ని కొరుకుడు పడని నిజాలు చెబుతానని అంటున్నాడు. ఒంటిని శుభ్రపరచుకోవడానికి స్నానం దండగమారి పని అని, అది ఆరోగ్యానికి మేలు చేయకపోగా కీడు తెగ చేసోస్తోందని బాధపడుతున్నాడీ ఎంఐటీకి చెందిన రసాయన శాస్త్రవేత్త. సబ్బులు, షాంపూల్లో ఉండే రసాయనాలు ఒంటిపై ఉండే మంచి బ్యాక్టీరియాను చంపేసి చర్మాన్ని నిర్జీవం చేస్తాయట. స్నానం బదులు మంచి బ్యాక్టీరియా ఉన్న మిస్ట్‌ను తాను 12 ఏళ్లుగా ఇలాగే స్ప్రే కొట్టుకుని ఆరోగ్యంగా ఉన్నానని చెబుతున్నాడు. గుర్రాలు మట్టిలో ఎందుకు ఊరికే పొర్లుతుంటాయనే ఆ ప్రశ్న పెద్ద రీసెర్చ్‌నే కానిచ్చింది డేవ్‌తో. ఏదైనా గొప్ప ఉపయోగం లేకపోతే ఇన్ని వేల పరిణామ క్రమ మార్పుల్లో ఈ అంశం ఎప్పుడో వదిలిపెట్టేసేవి, ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నాయని పరిశోధించగా ఈ విషయం బయటపడింది. చెమట, జిడ్డును భక్షిస్తూ నైట్రిక్ ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా చర్మంపై ఉండే మంచి బ్యాక్టీరియా రక్త పోటు నియంత్రణతో పాటు అనేక రకాలుగా మేలు చేస్తాయని తేలింది. మదర్ డర్ట్ పేరిట ఈ బ్యాక్టీరియాను స్ప్రే బాటిళ్లలో నింపి మార్కెట్ చేస్తున్నాడిపుడు.



పెళ్లి వద్దు...చదువుకుంటా...

అంత వరకు తనో మామూలు అమ్మాయే. ఓ మారుమూల పల్లెలో పేద కుటుంబం ఆమెది. ఇంట్లో అమ్మకు సాయం చేయడం... బడికి వెళ్లడం...అంత వరకే. ఎప్పుడైతే అమ్మానాన్నలు చెప్పినదానికి అడ్డంగా తల ఊపిందో అప్పుడు ఆమె గురించి ఊళ్లో చర్చ మొదలైంది. చెవులు కొరుక్కోవడం ప్రారంభమైంది. అయినా సరే అవేవీ లెక్కచేయలేదా చిన్నారి. తన మనసులోని మాటను బహిరంగంగా మీడియా ముందర వ్యక్తం చేసిందో రోజు. దాంతో ఆ పల్లెటూరి పిల్ల గురించి ఒక్కసారిగా దేశం అంతటికి తెలిసిపోయింది. ఆ తర్వాత పుస్తకాల ద్వారా ప్రపంచానికే పరిచయమైంది. ఆ సాహసబాలికే రేఖా కాళింది.

పశ్చిమ బెంగాల్ లోని పురూలియా జిల్లా. అందులో ఓ కుగ్రామం. అక్కడ అంతా చిన్నా చితకా పనులు చేసుకుంటూ బతుకులీడ్చేవారే. వారిలో రేఖా కాళింది కుటుంబం ఒకటి. సరిగ్గా పదిహేనేళ్ల కిందట ఆమె పుట్టినప్పుడు అపశకునంగా భావించారు. అక్కడ ఆడపిల్ల పుడితే అంతే మరి. బాగా పసితనం నుంచే తల్లికి ఇంటి పనుల్లో సాయం చేసేది రేఖ. ఇంకా బడికి చేర్చకముందే కూలి పనిలో చేరింది. బడి ఈడు పిల్లలు పని ప్రాంతంలో కాదు. బడిలో వుండాలన్న నినాదంతో ప్రభుత్వం ముందుకు వచ్చినప్పుడు ... రేఖ మొదటిసారిగా బళ్లో అడుగెట్టింది. అప్పటి వరకు బండ పనులు చేసిన ఆ చిట్టి చేతులకు పలకా బలపం అందడంతో కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. పసితనం నుంచి టీచర్లు చెప్పే పాఠాలు ఎంతో ఆసక్తితో వినేది. వాళ్లు చెప్పే అనేక విషయాలను ఆకళింపు చేసుకోవడానికి ప్రయత్నించేది. అప్పుడే తనకూ కొన్ని హక్కులు వున్నాయని తెలుసుకొంది. పదేళ్ల వయసులో తల్లిదండ్రులు తన పెళ్లి ప్రస్తావన తెచ్చినప్పుడు తనకా పెళ్లి వద్దని చెప్పడానికి ఆ చైతన్యమే ఉపయోగపడింది.

పదేళ్లకు పెళ్లా!

ఎప్పటిలాగే బడి నుంచి ఇంటికి వచ్చిన రేఖకు తల్లిదండ్రులు పెళ్లి గురించి చెప్పారు. పెళ్లి వల్ల అకస్మాత్తుగా బడి మానేసిన నేస్తాల్లో తనూ ఒకటి కావడం ఏమాత్రం ఇష్టం లేకపోయింది. అత్తగారిళ్లల్లో వయసుకు మించిన పనులు, బాధ్యతలు నెరవేర్చాల్సి రావడం ఆమెకు ఏమాత్రం నచ్చలేదు. పన్నెండేళ్లకే పెళ్లి పిల్లలతో అక్క పడుతున్న కష్టాలే అందుకు కారణం. కానీ అమ్మానాన్నా ఊరుకుంటేగా! అబ్బాయి తరపు వారు తాము ఇస్తానన్న కొద్దిపాటి కట్నానికే పెళ్లి ఒప్పుకున్నారు కనక తప్పదన్నట్టు ఒత్తిడి చేసేశారు. అబ్బాయి తల్లికి కూడా చెప్పేసింది. తనకు వంట రాదని. లెక్కలు చేయడం, చదువుకోవడమే ఇష్టమని. అయినా సరే వారు వదల్లేదు. రంగు తక్కువగా వున్నా, కట్నం పెద్దగా ఇవ్వకపోయినా చురుకైన దానివన్న కారణంగానే ఇంటి కోడలిని చేసుకుంటామన్నారు. ఆ మాటలు రేఖకు అస్సలు

అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌తో...

నచ్చలేదు. తను పెళ్లి చేసుకోను కాక చేసుకోనంది. ఆమె అంత మొండిగా వుండడంతో కొద్ది రోజులపాటు విషయాన్ని వాయిదా వేద్దామనుకున్నారు పెద్దలు. ఓరోజు తమ గ్రామం వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి ముందు తన గాథను వివరించింది రేఖ. అక్కడ వున్న మీడియా ఈమె సాహస కథనాన్ని ప్రముఖంగా ఫొటోలతో సహా ప్రచురించింది. 'బాల్య వివాహాన్ని కాదన్న సాహస బాలిక' అంటూ పత్రికల్లో, చానళ్లలో రావడం చూసి తల్లి హడలిపోయింది. కూతుర్ని కొట్టి. తినడానికి ఏమీ ఇవ్వకుండా గదిలో బంధించేసింది. కడుపు కాలుతున్నా సహించింది కానీ బడికి వెళ్లనందుకు చాలా బాధపడింది. కార్మిక శాఖా మంత్రిత్వ శాఖ, స్కూల్లో టీచరు కలుగచేసుకోవడంతో తిరిగి బడి ముఖం చూడగలిగింది.

ప్రపంచ ఖ్యాతి

ఇక అక్కడినుంచి టీచర్ల సహకారంతో ఊరూరా తిరిగి బాల్య వివాహానికి వ్యతిరేకంగా తను చేసిన తిరుగుబాటును వివరించింది. అలా వేలాదిమంది ఆడపిల్లలు పెద్దలు తమకు తలపెట్టిన వివాహానికి వ్యతిరేకంగా గొంతు విప్పి ... తిరిగి బడి బాట పట్టారు. బాల్య వివాహం వద్దని బడికెళ్లిన కాళింది.... సాహస బాలిక అవార్డు కూడా అందుకుంది. తర్వాత ఆమె సాహస గాథను, స్ఫూర్తి పాఠాన్ని మొసిన్ ఎన్జాయేమీ గ్రంథస్తం చేసి ప్రపంచం ముందుంచింది. ఇది కాక ప్రపంచాన్నే మార్చిన చిన్నారులు (చిల్డ్రన్ హు ఛేంజ్డ్ ది వరల్డ్) అన్న డచ్ పుస్తకంలో మలాలా, అన్నే ఫ్రాంక్ వంటి ప్రపంచ ప్రసిద్ధ చిన్నారుల సరసన స్థానం సంపాదించుకుంది. ✦

◆ కథ

సాగర మథనం

- అజయ్ కుమార్ వారాల
9502395077

చప్పున లేచాడు విక్రమ్. ఏంటీ పాడు కల!... అని కళ్లు నలుపుకుంటూ, దుప్పటి కాలితో దగ్గరకు లాగాడు. పక్కన ఏదో మూలుగు వినబడుతోంది. తెరలు తెరలుగా వెలుగు కనిపిస్తోంది. ఇంకా పూర్తిగా తెల్లారలేదు. నిద్ర మత్తులోనే లేచి డాబా పైన కలియతిరిగాడు. ట్యాంక్ పక్కన కూర్చుని ఉన్న సాగర్‌ను చూశాడు. విక్రమ్ ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. ఏదో భయం వెన్నును రిక్కపొడుచుకునేలా చేసింది. సాగర్ దగ్గరకు పరుగున వెళ్లాడు. వాణ్ని పైకి లేపే ప్రయత్నం చేశాడు. కాలికి ఏదో తడి అంటుకుంటోంది. తీరా చూస్తే రక్తం. సాగర్ చేయికోసుకున్నాడు. ఇంకా ఉన్నాడో లేడో తెలీదు. ఇంత సేపు వచ్చిన మూలుగు కూడా ఆగిపోయింది. విక్రమ్ గుండె ఆగిపోతుందేమో అన్నంత వేగంగా కొట్టుకుంటోంది. సాగర్‌ను లేపేందుకు అనేక ప్రయత్నాలు చేశాడు. కాళ్ల చేతులు వణుకుతున్నాయి విక్రమ్‌కు. సాగర్‌ను ఓ పక్కగా పడుకోబెట్టాడు. ముఖంపై నీళ్లు కొట్టాడు. తన చేతులకు అయిన రక్తాన్ని కంగారులో తనకే తుడుచుకుంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ కిందకు పరిగెత్తాడు. పక్క ఫ్లాట్‌లోని ఓనర్‌ను లేపాడు.

• • •

సాగర్ అమ్మానాన్నలు కంగారుపడుతూ ఆస్పత్రికి వచ్చారు. వారి దగ్గర నుంచి వివరాల్ని నమోదు చేసుకుని, విక్రమ్‌ను పోలీసులు మరోసారి విచారణ కోసం తీసుకెళ్లారు. విక్రమ్‌నూ అనుమానిస్తున్నారు. విక్రమ్‌ను పోలీసు జీప్‌లో తీసుకెళుతున్నారు. విక్రమ్‌లో ఏ భయం లేదు. బాధ, కోపం తప్ప. సాగర్ గురించే ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి కన్నీళ్లు వస్తున్నాయి. ఎన్నాళ్ల స్నేహం వారిది. ఎన్ని విషయాల్ని కలిసి పంచుకున్నారు. అమ్మనాన్నలు, తోబుట్టువులు, బంధువులు ఎక్కడో ఉంటారు. ఉద్యోగాల కోసం ఊరిని వదిలిపెట్టి వచ్చారు. ఇంటర్వ్యూ దగ్గర కలిపిన మాట... మూడేళ్లుగా కలిసిఉండేలా చేసింది. ఇద్దరివీ వేర్వేరు నేపథ్యాలు, వేర్వేరు లక్ష్యాలు. సాగర్‌ది దిగువ మధ్యతరగతి కుటుంబం. తమ జీవితంలా ప్రతి రూపాయికు వెతుక్కోకూడదని అప్పుచేసి మరీ సాగర్‌ను చదివించారు తల్లిదండ్రులు. ఆ అప్పుల్ని త్వరగా తీర్చి అమ్మనాన్నల్ని గొప్పగా చూసుకోవాలని తపన సాగర్‌ది. ఫోన్‌లో ఎక్కడా లేని ధైర్యాన్ని మాట్లాడే సాగర్ ఎందుకిలా చేసుకున్నాడో విక్రమ్‌కి అర్థం కాలేదు. జీపు స్టేషన్ ముందు ఆగింది. కానిస్టేబుల్ సూర్య నవ్వుతూ ఎదుట ఉన్న హెడ్‌ను పలకరించాడు. విక్రమ్ ఇంకా ఆలోచనల్లోనే ఉన్నాడు. "దిగు తమ్ముడూ... దారికి బండి అడ్డంగా ఉంది. పక్కన పెట్టేద్దాం." అని సూర్య అనడంతో విక్రమ్ తేరుకున్నాడు. సాయంత్రానికి విక్రమ్ ఆస్పత్రికి చేరుకున్నాడు.

•••

సాగర్ తల్లి విక్రమ్ చేయి పట్టుకుని ఏడుస్తోంది. ఆమె కళ్లలోని బాధ విక్రమ్‌నూ కాల్చేస్తోంది. ఏం మాట్లాడలేక పోయాడు. ఇంతలో వాళ్ల నాన్న అక్కడకు వచ్చాడు. చేతిలో టిఫిన్ ప్యాకెట్. విక్రమ్ వైపు ఓ సారి చూసి మళ్లీ పొట్లం విప్పే పనిలో పడ్డాడు. "నువ్వు టిఫిన్ చేశావా బాబు? నీక్కూడా తెమ్మంటావా?" అంటూ పొట్లాన్ని భార్యకు ఇచ్చే ప్రయత్నం చేశాడు. ఆమె విక్రమ్ చేయి వదల్లేదు. కన్నీటి ధార ఆగలేదు. "ఏం చేస్తాం చెప్పు. వాడు అలా చేసుకుంటాడని తెలిస్తే ఇంత దూరం ఎందుకు ఉంచేవాణ్ని. మనూళ్లోనే ఏదో చోట పని వెతికేవాణ్ని. అంతా బాగుందని చెప్పాడు. ఆఫీసులో వాళ్ల గురించి చెప్పి నవ్వేవాడు. బాస్ మెచ్చుకున్నది... వాళ్ల ఫ్రెండ్స్ పార్టీల గురించి అన్నీ... చాలా సంతోషంగా ఉండేది. ఒక్క మాట పొల్లు పోకుండా, నా స్నేహితులకు చెప్పి మురిసి..." అని సాగర్ తండ్రి మాటల ప్రవాహానికి గొంతు జీర అడ్డుపడింది. కంట తడి ముఖం పక్కకు తిప్పేలా చేసింది. విక్రమ్ ఆ పరిస్థితిలో ఉండలేకపోయాడు. ఏం మాట్లాడాలో తెలీదు. వాళ్లను ఎలా ఓదార్చాలో తెలీదు. అక్కడ క్షణం ఉండలేక సాగర్‌ను చూడాలని ఐసీయూ రూం దగ్గరకు వెళ్లాడు. సాగర్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అవును, సాగర్ ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటాడు. తాను వర్క్ టెన్షన్ గురించి, బాస్ అహంకారం గురించి, కొలీగ్స్ సహకరించకపోవడం గురించి చెప్పి తిడుతుంటే, సాగర్ ఓపిగ్గా మొత్తం వినేవాడు. ప్రశాంతంగా నవ్వేవాడు. కోపంతో రగిలిపోతుంటే వాడు నవ్వుకోవడంతో మరింత లావా ఎగజిమ్మేది. వాడు ఎంత తెలివైనవాడంటే, నాలో మార్పును గమనించి వెంటనే ఫోన్ వచ్చిందనో, ఏదో గుర్తొచ్చిందనో బాల్కనీలోకి వెళ్లిపోయేవాడు. బాధగా ఎప్పుడూ ఏ విషయమూ చెప్పేవాడు కాదు. ఎప్పుడూ పెద్దపెద్ద విషయాల గురించి మాట్లాడుతుంటే, అమ్మాయిల గురించి సరదాగా మాట్లాడుతుంటే వీడికే కష్టమూ లేదు. అందుకే నా బాధ అర్థం కావడంలేదని పొరబడ్డానేమో... అని విక్రమ్ అనుకుంటుండగా సాగర్ కదిలాడు. అద్దం దగ్గరగా ముఖం పెట్టి చూశాడు, రాడీ చేసుకున్నాడు. పక్కనే ఉన్న నర్సుకు చెప్పి,

పరుగున సాగర్ తల్లిదండ్రుల దగ్గరికి చేరుకున్నాడు. టిఫిన్ పొట్లం అలాగే ఉంది. సాగర్ వాళ్లమ్మ భర్త భుజాన్ని పట్టుకుని ఏడుస్తూనే ఉంది. సాగర్ నాన్న ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు. విక్రమ్ పరుగు ఆపి వాళ్ల దగ్గరకు నిదానంగానే నడిచాడు. "నేనేం అన్యాయం చేశాన్రా..." అంటున్న సాగర్ నాన్న విక్రమ్‌ను చూసి మాట ఆపేశాడు. విక్రమ్ కళ్లలో ఏదో సంతోషాన్ని గమనించాడు.

•••

చాన్నాళ్లకు విక్రమ్ సాగర్ ఊరికి వెళ్లాడు. అక్కడే ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. విక్రమ్ కోసం స్టేషన్‌కొచ్చాడు సాగర్. ఇదివరకటిలానే సాగర్ కనిపిస్తున్నాడు. ప్రశాంతంగా, నవ్వుతూ. బైక్ మీద సగం దూరం వెళ్లాక ఓ చోట ఆపాడు. చెట్టు కింద ఉన్న టీస్టాల్ దగ్గరకు నడిచి, టీనా, కాఫీనా అని అడిగాడు విక్రమ్‌ను సాగర్. టీ... ఓకే. ఇద్దరూ కాస్త దూరంగా ఉన్న దిమ్మె మీద కూర్చున్నారు. "ఇంకేంట్రా? అంతా బాగానే ఉందా. మొన్నామధ్య మీ కొత్త బాస్ గురించి చెప్పావ్. చాలా మంచివాడన్నావ్. ఇన్నాళ్లకు అర్థం చేసుకునేవాడు దొరికాడని సంతోషంగా మాట్లాడావ్. ఎప్పుడూ లేని జోష్‌తో కబుర్లు చెబుతున్నావ్. అంతా హ్యాపీనే అనమాట." అని ఎప్పటిలానే ప్రశాంతంగా, నవ్వుతూ అన్నాడు సాగర్. ఇంతలో టీ చేతికి అందింది. నిండుగా ఉన్న కప్పులో నుంచి టీని కాస్త పక్కన పోసి నోటికి ఆనించాడు విక్రమ్. సాగర్ కప్పు పక్కన పెట్టి, కొన్ని నీళ్లు తాగాడు. షర్టు చేతుల్ని వెనక్కు మడిచి టీ కప్పు అందుకున్నాడు. చేయి కోసుకున్న గాయం విక్రమ్ కంట బడింది. చావాలని ఎందుకు ప్రయత్నించాడో సాగరే చెబుతాడులే... దాని గురించి అడిగి మళ్లీ ఎందుకు ఇబ్బంది పెట్టాలని... ఇన్నాళ్లు ఆ విషయం కదపలేదు విక్రమ్. ఈ సారి అడిగేయాలనిపించింది. ఇంతలో సాగర్ టీ కొట్టు వాడితో ఏదో అంటూ నవ్వాడు. విక్రమ్ ఆలోచనలోంచి బయట పడ్డాడు. "ఇంకేంట్రా..." అని అనబోతుండగా సాగర్ గట్టిగా గాలి పీల్చుకుని విక్రమ్ కళ్లలోకి చూశాడు. "సారీ రా విక్రమ్. చాలా రోజులు మనం కలిసి ఉన్నా, నా గురించి నీకు పూర్తిగా చెప్పలేదు. నీ టెన్షన్లు నీవని, నావి కూడా చెప్పి బాధ పెట్టడం ఇష్టంలేక ఏం చెప్పలేదు." అని కాసేపు ఆగాడు. చెట్టు నుంచి రాలి పడుతున్న దుమ్ము టీలో పడకుండా చేతిని అడ్డు పెడుతూ "ఏంట్రా" అన్నట్టు తలూపాడు విక్రమ్. "ఏం లేదురా. చనిపోవాలనుకున్నానే దాని గురించి. నిజానికి ఆ ఆలోచన చాలా రోజుల ముందు నుంచే ఉండేది. కానీ, అమ్మానాన్నల ఫోన్లతో, నీతో తిరుగుళ్లతో సమయం గడిచిపోయేది. ఆలోచన మారిపోయేది. ఏం చెప్పాలిరా... ఇక్కడ ఉన్నప్పుడే ఓ అమ్మాయిని ప్రేమించాను. చాలా మంచిది. తనూ నన్ను ఇష్టపడింది. ఒక్కరోజు మాట్లాడకపోయినా ఊరుకునేది కాదు. నేనంటే తనకి ప్రాణం. కాకపోతే మాలాగే వాళ్లదీ లేని కుటుంబమే." అని ఆగాడు. ఇంతలో విక్రమ్ టీ అయిపోయింది. సాగర్ మాత్రం తాగలేదు. పక్కన పెట్టిన టీ కప్పు అలానే ఉంది. ఏం అనాలో తెలీక, "ముందు టీ తాగరా!" అని విక్రమ్ అన్నాడు. "తను లేని జీవితమనే ఊహే భరించలేకపోయేవాణ్ని. తనూ అంతే. ఎన్నో చెప్పుకున్నాం, అనుకున్నాం. పెళ్లి కోసం ఎదురుచూశాం. గంటల తరబడి మాట్లడకపోయినా, మాట్లాడిన పది నిమిషాలు చాలు. అన్నీ టెన్షన్లను మర్చిపోవడానికి. లోకం ఎంతో ఆహ్లాదంగా, తాజాగా, రంగుల్లో కనిపించేది. అంతా నా కోసమే అన్నట్టుండేది. దేన్నైనా సాధించగలను, దేన్నైనా ఎదుర్కోగలను అనే యాటిట్యూడ్. ఓ రకంగా అది నాకు

"బతుకు కష్టాలు కష్టాలే. మానసికంగా మాత్రం చాలా డబ్బున్నోళ్లైపోయారు. అదే నేను చనిపోతే ఇవన్నీ ఉండేవా. ఏం సాధించే వాడిని. అసలిప్పుడే నేను జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నాను. హాయిగా ఆస్వాదిస్తున్నాను. అప్పుడు ప్రేమ ఇచ్చిన శక్తి నడిపించింది."

చాలానే మేలు చేసింది. ప్రతి చోట విజయం దొరికేది. ఎంత పని ఉన్నా ఈజీగా ఆడుతూ, పాడుతూ ఫినిష్ చేసేసేవాణ్ని. అమ్మానాన్నలు నా ఉత్సాహాన్ని చూసి మురిసిపోయేవాళ్లు. గుర్తుందా... నువ్వు కూడా కోపంగా తిట్టేవాడివి కాస్తా నవ్వేసేవాడివి. ఏంటో రా ఆ జీవితం. ప్రేమ నిజంగా గ్రేట్ రా. తెలీని శక్తి. ఆ లోకంలో అంతా సాధ్యమే. అంతా..." అని లేచి నిలబడ్డాడు. కంటతడిని తుడుచుకుంటూ ఎంతైంది అంటూ టీ కొట్టు అతణ్ని అడిగాడు. జేబులోంచి డబ్బులు తీసి ఇచ్చేసి బైక్ ఎక్కాడు. విక్రమ్ ఎక్కేలోగా "సార్ చిల్లర..." అంటూ వచ్చి ఇచ్చాడు టీ కొట్టు అతడు. విక్రమ్‌కు అర్థమైంది... సాగర్ ఆత్మహత్యాయత్నం వెనుక కారణం. ఏం మాట్లాడకుండా కూర్చున్నాడు.

•••

సాగర్ వాళ్ల ఇల్లు చిన్నగా ఉన్నా చాలా బాగుంది. ఇంటి ముందు పూల కుండీలు, కూర్చోడానికి అరుగు, ఎదురుగ్గా చిన్న పార్క్. చాలా నచ్చింది విక్రమ్‌కు. తక్కువ వస్తువులే ఉన్నా అంతా నీటుగా, చాలా అందంగా పొందిగ్గా సర్ది ఉన్నాయి. గోడలకు రకరకాల అలంకరణలు చేసి ఉన్నాయి. టీవీ పై అరలైతే బొమ్మల కొలువులా ఉన్నాయి. సాగర్‌కు మంచి టేస్ట్ ఉంది. సాగర్ తల్లిదండ్రులు ఆత్మీయంగా పలకరించారు విక్రమ్‌ను. చాలా సంతోషంగా కనిపించారు. వాళ్లనలా చూసే సరికి విక్రమ్‌కు ఎంతో బలమొచ్చినట్టు అనిపించింది. వాళ్లకన్నా రెట్టింపు ఆనందం ప్రవేశించినట్టు ఉంది. తొలిసారి పరిచయంలో అంతా విషాద ఛాయలే. ఇప్పుడు అలా లేదు. లగేజీ అక్కడ పెట్టేసి అమ్మా ఇప్పుడే వస్తాం అని చెప్పి విక్రమ్‌ను బయటకు తీసుకువెళ్లాడు. టీ తాగి వెళ్లండ్రా అని వాళ్ల అమ్మ అంటుంటే... ఇప్పుడే తాగాం అని చెప్పి వెళ్లిపోయారు.

•••

ఊరికి దూరంగా అరగంట ప్రయాణం. అంతా నిశ్శబ్దం... బైకు చప్పుడు తప్ప. పెద్ద గ్రౌండ్ వచ్చింది. చాలా మంది క్రికెట్ ఆడుతున్నారు. ఆకాశంలో ఎటుచూసినా బంతులే. అంతగా జట్లతో కిక్కిరిసిపోయి ఉంది మైదానం. బైక్ చెట్ల నీడన పెడుతున్న సాగర్‌ను అరుస్తూ పలకరించింది ఓ టీమ్. చేయి ఊపుతూ నవ్వాడతడు. "మీ ఫ్రెండ్సా?" అడిగాడు విక్రమ్. "జూనియర్స్‌రా... మేమూ ఇక్కడే ఆడేవాళ్లం. ఇదే మా అడ్డా." అంటూ మట్టి దులిపి సాగర్ అక్కడ చెప్పులు వేసి వాటిపై కూర్చున్నాడు. విక్రమ్ కూడా అలానే చేశాడు. ఎవరో ఫోర్ కొడితే చప్పట్లు కొట్టి అరిచాడు. తనవైపు వస్తున్న బంతిని తీసుకుని వాళ్ల వైపు విసిరేశాడు. "భలే ఆడతార్రా వీళ్లు. ఇండియా టీమ్‌లోకి వెళ్లేంత టాలెంట్ ఉంది. కానీ, ఎవరూ సీరియస్‌గా ఆ విషయాన్ని ఆలోచించరు. వాళ్లకు ఈ గ్రౌండే అంతా. సరదాగా ఆడతారనే మాటే కానీ, అచ్చు ఐపీఎల్ మ్యాచ్‌లంత ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. గెలిచేందుకు చాలా పోరాటమే చేస్తారు. మ్యాచుల్లో తిట్టుకుంటారు. కొట్టుకునే వరకూ వెళతారు. ఆడేది వాళ్ల మిత్రులతోనే కావడంతో స్టంపులు బలైపోతాయి పాపం." అంటూ నవ్వాడు సాగర్. విక్రమ్ మరో సిక్స్‌ను చూశాడు. తెలీకుండానే చప్పట్లు కొట్టాడు. "అంత హడావిడి చేస్తార్రా... తీరా మ్యాచ్ అవగానే అందరూ కలిసి ఐస్ అమ్మే వాడి దగ్గరకు పరిగెడతారు. గెలిచిన వాళ్ల దగ్గర డబ్బులు గుంజుకుని పార్టీ అంటూ ఐస్ ఫ్రూట్ బాక్స్‌లు ఖాళీ చేస్తారు. రెండు టీమ్‌లు కాస్తా ఒకే టీమ్ అయిపోయి ఫొటోలకు ఫోజులిస్తూ, సరదాగా కొట్టుకుంటూ, చెట్లపైకి ఎక్కి దూకుతూ..." సాగర్ చాలా సంతోషంగా చెబుతున్నాడు. అతడి కళ్లలో ఎంత సంతోషమంటే... ఆనందం పూనకంలా పట్టినట్టు. "అచ్చు మేం కూడా అలానే ఎంజాయ్ చేసేవాళ్లం. మ్యాచ్ జరిగేంత వరకు యుద్ధం చేస్తున్నంత సీరియస్‌గా ఆడేవాళ్లం. గెలిచేందుకు సిన్సియర్‌గా ప్రయత్నించేవాళ్లం. ఓడిపోతే బాధపడినా... క్షణాల్లో అది ఆవిరైపోయేది. అసలు అంతకు

ముందు మ్యాచ్ జరగనట్టు కబుర్లలో, తుంటరి పనుల్లో పడిపోయేవాళ్లం. అలాగే ఆడాలిరా. బతకడం అలాగే ఉండాలిరా." అంటూ సాగర్ మళ్లీ ఆలోచనలో పడిపోయాడు.

"ఈ లాజిక్ పట్టుకోకే, నేనా పరిస్థితి వరకూ వెళ్లిపోయా." అంటూ గాయం చేసిన గాటును తడుముకుంటూ చూశాడు. విక్రమ్‌కు అర్థం కాలేదు. ఏం అంటున్నాడో. ఆ ప్రశ్నా ముఖాన్ని గమనించాడు సాగర్. "ప్రేమించాను అని చెప్పానే... ఆ అమ్మాయికి పెళ్లి కుదిరింది. నాకా ఇంట్లో చెప్పి పెళ్లి చేసుకునే పరిస్థితి కాదు. ముందు అప్పులు తీర్చాకే ఏదైనా. ఆ అమ్మాయిని తీసుకొచ్చి ఇబ్బంది పెట్టడం ఎందుకని టైం అడిగాను. అలా అడుగుతూనే ఐదేళ్లు చేశాను. ఎన్నో సంబంధాలు వదులుకుంది. నేను కుదురుకోకుండానే ఇంట్లో చెబితే ఇంకా వేగంగా పెళ్లి పనులు మొదలెడతారని భయంతో తనూ ఇంట్లో చెప్పలేదు. ఇంతలో మరో మంచి సంబంధం వచ్చింది. ఇంట్లో వాళ్లు బాగా వత్తిడి తెచ్చారు. నన్నడిగితే ఉన్న టెన్షన్లతో సరిగా స్పందించలేదు. తానే మళ్లీ పెళ్లి ఆపుకుంటుందిలే అనే ధీమా. తనదేమో ఊపిరి బిగించిన పరిస్థితి. పెళ్లి చూపులతో ఆగిపోతుందిలే అనుకున్నది కాస్త ముహూర్తాల వరకు తంతు వెళ్లిపోయింది. ఆ విషయం చెప్పి ఏదో ఒకటి చేయమని నన్ను తొందరపెట్టింది. ఇద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. నాలుగు రోజులయ్యాక ఫోన్ చేసి పెళ్లికి రమ్మని చెప్పింది." అంటూ నేలను చూశాడు సాగర్.

విక్రమ్‌కు పూర్తిగా అర్థమైంది. ఎంతో ఆశావహంగా బతికే సాగర్ ఎందుకు ఆ రోజు అంత ఇదిగా కనిపించాడో, ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడో... తెలిసింది. ప్రేమ కట్టిన ఆశావహ లోకం... కూలిపోయే సరికి, ప్రేమ ఇచ్చిన జీవం... చనిపోయేసరికి, ప్రేమ నడిపించిన మార్గం... అడ్డుగోడయ్యేసరికి. అప్పటి వరకు ప్రేమ అందించిన దన్ను తొలగిపోయేసరికి సాగర్ జీవితం తలకిందులైంది. సాగర్ యాటిట్యూడ్ కకావికలం అయింది. సాగర్ విల్‌పవర్ కాలిబూడిదైంది. సాగర్ ఆశ్రయించిన శక్తి ఆవిరైంది. ముఖ్యంగా తనే సర్వస్వం అనుకున్న అమ్మాయి, కాదు వాడి ప్రాణం దూరమైంది. అదీ అతడి చేతుల్లో లేక, ఏం చేయలేక. అందుకే ఆ నిర్ణయం. ఇంతలో ఎవరో మళ్లీ ఫోర్ కొట్టారు. బంతి దొర్లుకుంటూ వచ్చింది. గ్రౌండంతా అరుపులు. మిగతా జట్ల వాళ్లు ఓ బాల్ ఆపి మరీ ఆ జట్టు వైపు చూశారు. వాళ్లంతా ఎగురుతున్నారు. ఛాతీలతో కొట్టుకుంటున్నారు. అవతలి జట్టును ఆటపట్టిస్తున్నారు. వాళ్లు కూడా అదే స్థాయిలో వీళ్లను కవ్విస్తున్నారు. కాసేపటికి ఐస్ బండి వచ్చింది. రెండు జట్లూ అక్కడికి పరిగెత్తాయి. గెలిచిన వాళ్లను తరుముతూ ఓడినవాళ్ల డబ్బులు లాక్కుంటున్నారు. అది చూస్తున్న విక్రమ్‌కు చాలా నచ్చింది. అంత సీరియస్ టాపిక్ మాట్లాడుతున్న భారం తొలిగిపోయింది.

"చూశావా రా. నేను చెప్పాగా. చూడు ఎంత సంతోషంగా ఉన్నారో." అని సాగర్ పైకి లేచి వాళ్ల వైపు చేయి ఊపాడు. వాళ్లలో ఒకడు పరుగున వచ్చి వీళ్లకూ రెండు ఐస్ ఫ్రూట్లు ఇచ్చి వెళ్లాడు. "ఇదేరా జీవితం. ఇలాగేరా ఉండాలి. నన్ను ఇక్కడికి తీసుకొచ్చేశాక. కొన్ని రోజులు ఏం తోయలేదు. ఒంటరిగా ఉంటే తనే గుర్తొచ్చేది. అందుకే ఇక్కడికి వచ్చేసేవాణ్ని. కొన్ని రోజులు ఈ సందడిని పట్టించుకోలేదు. ఓ సారి హఠాత్తుగా అనిపించింది. వీళ్ల ఆడే ఆటలా జీవితం కనిపించింది. తనూ, నేను ఎన్నో అనుకున్నాం. కానీ..." అని నిట్టూర్చాడు సాగర్. "అయినా మేం ఏం తప్పు చేశాం. ప్రేమించుకున్నాం, కలిసి బతకాలని అనుకున్నాం. నిజంగా ప్రేమించేవాడు తను ప్రేమించిన అమ్మాయి సంతోషంగా ఉండాలని కోరుకుంటాడు. తనతో బతికితేనే ప్రేమ అని అనుకుంటే, వన్‌సైడ్ లవర్స్ పరిస్థితేంటిరా. నేను ప్రేమించిన అమ్మాయిని ఇంకెవరో ప్రేమించి ఉండవచ్చు. తను నన్ను ప్రేమించేసరికి విషయం చెప్పకపోవచ్చు. అలానే నేను తీసుకోవాలి కదా. కానీ, నేనే అతిగా ఆలోచించా. వీళ్లలా ఓటమిని స్పోర్టివ్‌గా తీసుకోలేకపోయా. మన చేతుల్లో లేని దాని గురించి ఎక్కువ ఆలోచించి తప్పించుకోలేకపోయా. అది కేవలం చిన్న క్రికెట్ మ్యాచ్ కావొచ్చు. నాది అంతకంటే పెద్ద జీవితం కావొచ్చు. వాళ్లలా ఓటమి తర్వాత ఎగిరి గెంతెయ్యక పోవచ్చు. కానీ, జీవితం అన్నాక ఎప్పుడూ విజయమే ఉండదన్న లాజిక్కును మిస్సయ్యాను. మ్యాచ్ తర్వాత మళ్లీ మ్యాచ్ ఉంటుందని, ఇంకో మ్యాచ్ గెలిచే అవకాశముంటుందనే లాజిక్కుని జీవితానికి అన్వయించుకోలేకపోయాను."

ఈలోగా కొందరు అక్కడికి వచ్చి "సాగర్ అన్నా! ఈ వెధవలు ఈ ఒక్క మ్యాచ్ గెలిచేసరికి పెద్ద బిల్డప్ ఇస్తున్నారు. వచ్చే మ్యాచ్ చూడు ఏం జరుగుతుందో. సరే కానీ ఈయన ఎవరూ? మీ ఫ్రెండా? హాయ్!" అని విక్రమ్‌ను పలకరించి అక్కడి నుంచి పరుగున మళ్లీ వాళ్ల మిత్రులను చేరుకుని మరో రౌండు ఐస్ ఫ్రూట్ల కోసం గొడవ పడుతున్నారు. సాగర్ వాళ్లవైపు ఓ చిన్న రాయి విసిరి "ముందు మ్యాచ్ ఆడండి రా" అంటూ అరిచాడు. నవ్వుతూ నావైపు తిరిగి "నిజంగా, ఆ రోజు అనర్థమే జరిగి చనిపోతే, మా అమ్మానాన్నలు ఏమైపోయేవారు. నా చావుకు కారణం ఓ రకంగా తన పెళ్లే అని తెలుసుకుని తనూ ఎంత కుమిలిపోయేది. తనను చేసుకున్నవాడూ నరకం అనుభవించేవాడు. నాకేం తెలిసేది కాద... ఇంతమంది జీవితాలు ఎంత అస్తవ్యస్తం అయిపోయి ఉండేవో. అయినా, మా స్నేహమే కదరా ప్రేమలా మారింది. మరి ప్రేమ, అభిమానంగా మారలేదా. ఇప్పుడు చూడు... ప్రతి పండగకు తను ఈ ఊరు వచ్చినప్పుడల్లా గుడి దగ్గరో, వాళ్ల ఇంటి ముందో కనిపిస్తూ ఉంటుంది. చాలా సంతోషంగా ఉంటుంది. తన పిల్లోడిని ముద్దు చేస్తూ ఉంటే మనసు పొంగిపోతూ ఉంటుంది. ఇదే కదా నా ప్రేమ కోరుకుంది... తను సంతోషంగా ఉండాలని. అంతా సరిగా ఆలోచించాక నా మనసు తేలికైంది. తనతో ఇదివరకటిలా మాట్లాడే అవకాశం లేదని తనతో జీవితం లేదని... కాస్త బాధ అనిపించినా తన నవ్వుల్ని చూసి నెగటివ్ ఆలోచనలన్నీ తేలిపోతాయి. మామూలు వాణ్నైపోయే సరికి అమ్మానాన్నలు నేను ఏదో గొప్ప విజయం సాధించినట్టు, ఏదో పెద్ద సంపాదించినట్టు కళకళలాడుతూ కనిపిస్తారు. కుంగుబాటులోంచి తేరుకోడానికి చాలదా ఇది. అందరూ ఎంతో హాయిగా, సంతోషంగా ఉంటున్నారు. బతుకు కష్టాలు కష్టాలే. మానసికంగా మాత్రం చాలా డబ్బున్నోళ్లైపోయారు. అదే నేను చనిపోతే ఇవన్నీ ఉండేవా. ఏం సాధించే వాడిని. అసలిప్పుడే నేను జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నాను. హాయిగా ఆస్వాదిస్తున్నాను. అప్పుడు ప్రేమ ఇచ్చిన శక్తి నడిపించింది. ఇప్పుడు నాకలాంటి ఏదో ఒక టానిక్ అవసరం లేదు. చాలా నేర్చుకున్నానురా విక్రమ్. నేను తెలుసుకోవడానికి చావు వరకు వెళ్లి రావాల్సి వచ్చింది. నువ్వు మాత్రం అంతవరకు వెళ్లకు రా. అందుకే ఓపనై పోయా. నా అనుభవమన్నా నీకు..." అని సాగర్ అనేలోపు విక్రమ్ గర్వంగా సాగర్ భుజాన్ని తట్టాడు. ఇంతలో సాగర్ జూనియర్స్ మధ్య మరో మ్యాచ్ మొదలైంది. అరుపులు, చప్పట్లు కూడా. ✦

చికెన్ బాల్స్

కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్-కప్పు, ఉడికించి నీళ్ల పిండేసిన మీల్ మేకర్ గ్రాన్యూల్స్- అర కప్పు, ఉప్పు-తగినంత, పసుపు-అర చెంచా, కారం- చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు - అరచెంచా, ఉల్లిపాయ -ఒకటి, ధనియాలు- ఐదు చెంచాలు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు-ఐదు , యాలకులు-రెండు పుట్నాలపప్పు- మూడు చెంచాలు, నూనె- వేయించడానికి సరిపడా

తయారీ

బాణలిలో ధనియాలు, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, పుట్నాలపప్పును దోరగా వేయించుకుని తీసుకోవాలి. వేడి చల్లారాక మెత్తని పొడిగా చేసుకుని పెట్టుకోవాలి. చికెన్‌ని శుభ్రంగా కడిగి మిక్సీలో తీసుకోవాలి. అందులో మీల్ మేకర్ గ్రాన్యూల్స్, తగినంత ఉప్పు, కారం, పసుపు, ఉల్లిపాయ తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి మెత్తగా చేసుకోవాలి. తరువాత మసాలా మిశ్రమం కూడా వేసి మరోసారి మిక్సీ పట్టి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇది ముద్దలా అవుతుంది. ఇప్పుడు ఉండల్లా చేసుకుని కాగుతున్న నూనెలో వేసుకోవాలి. ఎర్రగా వేగాక తీసేస్తే సరిపోతుంది.

మీల్ మేకర్‌తో మరిన్ని ...

పరోటా

కావాల్సిన పదార్థాలు

ఉడికించిన, నీళ్ళు పిండేసిన మీల్‌మేకర్ గ్రాన్యూల్స్- యాభై గ్రా, బంగాళదుంప, క్యారెట్- ఒక్కటి చొప్పున, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పచ్చిమిర్చి- రెండు, నూనె-పావుకప్పు, ఉప్పు- తగినంత, పసుపు-కొద్దిగా, జీలకర్ర- చెంచా, ఆవాలు- చెంచా, గోధుమపిండి- కప్పు

తయారీ

బాణలిలో రెండు చెంచాల నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్రా వేయించుకోవాలి. అందులో ఉడికించిన బంగాళదుంప, క్యారెట్ తురుము, ఉడికించిన గ్రాన్యూల్స్ వేసి వేయించాలి. రెండు నిమిషాల తరువాత తగినంత ఉప్పు, పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగు కలిపి దింపేయాలి. గోధుమ పిండిని తీసుకుని చిన్న చపాతీలా వత్తి మధ్యలో గ్రాన్యూల్స్ మిశ్రమాన్ని ఉంచి అంచుల్ని మూసేసి మళ్లీ వత్తాలి. దీన్ని పెనంపై ఉంచి నూనె వేసి కాల్చుకుని తీసుకోవాలి. ఇలా మిగిలిన పిండిని కూడా చేసుకుంటే నోరూరించే పరోటాలు సిద్ధం.

పకోడీ

కావాల్సిన పదార్థాలు

మీల్ మేకర్ గ్రాన్యూల్స్-అర కప్పు, ఉల్లిపాయలు- మూడు (సన్నగా తరగాలి), పచ్చి మిర్చి-ఐదు (సన్నగా తరగాలి), కొత్తిమీర-కట్ట, కరివేపాకు- నాలుగైదు రెబ్బలు, జీలకర్ర- చెంచా, కందిపప్పు పొడి- పావుకప్పు కన్నా ఎక్కువ, ఉప్పు- తగినంత, నూనె- వేయించడానికి సరిపడా.

తయారీ

మీల్ మేకర్ గ్రాన్యూల్స్‌ని ఉడికించి నీళ్ళు పిండేసి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలపాలి. కావాలనుకుంటే కొద్దిగా నీళ్ళు కూడా చల్లుకోవాలి. ఈ మిశ్రమాన్ని పకోడీల్లా వచ్చేలా కాగుతున్న నూనెలో వేసి వేయించుకోవాలి. బాగా వేగాక తీసుకుంటే సరిపోతుంది.

మీల్ మేకర్ 65

కావాల్సిన పదార్థాలు

మీల్ మేకర్ గ్రాన్యూల్స్- కప్పు, కొత్తిమీర తరుగు-అర కప్పు, పచ్చిమిర్చి -రెండు, జీలకర్ర-చెంచా, నూనె- అర కప్పు, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు వెల్లుల్లి- రెండు రెబ్బలు.

తయారీ

ముందుగా కొత్తిమీర, పచ్చిమిర్చి, జీలకర్రను మిక్సీలో తీసుకుని మెత్తగా చేసుకోవాలి. మీల్ మేకర్‌లో తగినంత ఉప్పు, పసుపు మరీ మెత్తగా కాకుండా దంచిన వెల్లుల్లి కొద్దిగా నీళ్ల పోసి పొయ్యి మీద పెట్టాలి. గ్రాన్యూల్స్ కొద్దిగా ఉడికాక దింపేయాలి.

బాణలిలో నూనె ముందుగా చేసుకున్న కొత్తిమీర వేయించాలి. తరువాత ఉడికించిన మీల్ మేకర్ గ్రాన్యూల్స్ కూడా వేయించి దింపేయాలి. ఇది చపాతీ, పూరీల్లోకి చాలా బాగుంటుంది.

ఖరీదైన బొమ్మ

అబ్బో ... ఇక్కడ బోలెడన్ని బొమ్మలున్నాయి. వాటి ధర కూడా ఇచ్చారు. అయితే మీరు అక్కడ వున్న గణితపు గుర్తుల ఆధారంగా లెక్కలు చేసి దేని ధర ఎంతో తెలుసుకోండి. ఆఖరుకు అన్నిట్లోకి ఖరీదైన బొమ్మ ఏదో చూసి సున్నా చుట్టేయండి.





బొమ్మను పూర్తించండి

పదాలను గుర్తించండి

ఈ చిత్రంలో చాలా అక్షరాలు దాగున్నాయి కదూ. అయితే ఈ చిత్రం దిగువన కొన్ని పదాలు ఇవ్వడం జరిగింది. వాటి ఆధారంగా పదాలను గుర్తించండి?

GRAPES LEMON ORANGE CHERRY GRAPEFRUIT TOMATO
APPLE STRAWBERRY PINEAPPLE WATERMELON BANANA



కత్తిరించి అతికించండి

చింటూకి కోపం వచ్చి జిరాఫీ బొమ్మ చించేశాడు. మీరేం చేయాలంటే వాటిని సరైన స్థానంలో అతికించాలి. మరి రెడీనా!

మొత్తం ఎన్ని దాగున్నాయి?

ఈ చిత్రంలో మొత్తం ఎన్ని బొమ్మలున్నాయి? వాటిని గుర్తించండి?

బుజ్జి స్టార్

ఈ ఫొటోలో వున్న నటుడు ఎవరో చెప్పుకోండి. ఇప్పుడు హీరో అతడు.

త్రిభుజాలు ఎన్ని?

ఇక్కడ చాలా ఆకారాలు వున్నాయి. వాటిలో త్రిభుజాలు ఎన్నో లెక్కించి చెప్పండి.



తెల్ల మీసాల కోతి

మీసాల కోతిని చూశారా ఎప్పుడైనా. ఇదిగో మీ ముందుకొచ్చింది అలాంటిదే. కాకపోతే దీనికి మీసాలు తెల్లగా వుంటాయి. అంటే ముసలి కోతి అనుకుంటారేమో. అదేం కాదు. వీటికి తెల్లటి మీసాలే వస్తాయి. కళ్ల చుట్టూ కాటిక పెట్టినట్టు నల్లగా వుంటుంది. మీసాలేమో తెల్లగా వుంటాయి. చూడ్డానికి భలే తమాషాగా అనిపిస్తుంది. ఇంతకీ దీని పేరేంటనుకున్నారు. ఎంపరర్ తమరిన్. ఉడుత అంతే వుంటుంది. 13 నుంచి 30 సెంటీమీటర్ల పొడవు పెరుగుతాయి. బరువు 220 నుంచి 900 గ్రాములు వుంటాయి. ఇవి 18 సంవత్సరాల వరకు జీవిస్తాయి. సెంట్రల్ అమెరికా నుంచి కొలంబియా వరకు ఈ కోతులను చూడొచ్చు. అడవుల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఒక చెట్టు మీద నుంచి ఒక చెట్టు మీదకు చాలా వేగంగా ఎగురుతూ వెళ్తాయి. ఇవి సింగిల్‌గా అస్సలు వుండవు. 40 కోతులు కలిసి గుంపుగా వుంటాయి. ఇవి పళ్లు, ఆకులు, సాలీళ్లు, క్రిమికీటకాలు, పక్షి గుడ్లను కూడా లాగించేస్తాయి.

అన్నీ నేనే



ఎదురింటి మేడ మాటున సూర్యుడు
తొంగి తొంగి చూస్తున్నాడు
నా కళ్లు కళ్లజోడును అందుకున్నాయి
మేఘాల్ని తరుముతూ
చెట్లు కొమ్మల్ని వూపుతూ
సూర్యుణ్ణి కొంచెం కొంచెం కదుపుతూ
కాలం అస్థిత్వాన్ని చాటుతూంది!
ప్రదర్శన నమూనాలై ముఖ్య వస్తువులు
దుకాణం ముందు వేలాడినట్టు
ముఖ్య వార్తలు పంచరంగుల్లో
ముందు పేజీ నాలుగు చెరగులా నిల్చాయి
పేపర్లోకి నడిచాను
నాలుగు కొదమసింహాలు
పదోతరగతి జింకపిల్లపై
పంజావిసిరి పోయాక
అవశేషాలు ఆస్పత్రికి చేరాయి
నేరస్తులు అధికారం నీడన నిద్రిస్తున్నారు
పోలీసులు ఫలితం లేని పరుగులు తీస్తున్నారు!
నిద్రిస్తున్నవాడు మంచంపైనే పట్టుబడ్డాడు
బనీను లుంగీయే సాక్ష్యం
వెయ్యికోట్ల అవినీతిని
లెక్కించటానికి కాగితాల్ని క్రోడీకరించటానికి
అధికార్లకు వారం రోజులు పడుతుంది!
రోడ్డు రక్తాన్ని పారించింది
నలభైమందిని మోసుకొస్తున్న బస్సు
సైకిల్ని చూసి భయపడింది
మరణించిన మొత్తంలో బ్రేకు ఇనస్పెక్టరు ఒకరు
ఇరవై ఏళ్లుగా లైసెన్సు లేని డ్రైవరు
బతికి బట్టకట్టాడు!
అసెంబ్లీ రణరంగమై
చెప్పులు ప్లేకార్డుల మయమైంది
బూతు పంచాంగం ముగిశాక
మురికి మధ్య కొందరు
మురికిని చిమ్ముతూ కొందరు!
ఏడాదిలో వేల కోట్లు వెనకేసిన దాత
లక్షరూపాయల దానంతో
దాహార్తుల దాహం తీర్చమంటూ
ప్రభుత్వానికి వినమ్ర విజ్ఞాపన!
గంజి దట్టించిన నేత చీరలవున్నా పేపరు
తోటకూర కాడలా వాలిపోయింది
వార్తలు నన్ను చూసి నవ్వాయి
నన్ను చూసి నేను నవ్వుకున్నాను
కర్తను నేనే
కర్మను నేనే
క్రియను నేనే!

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

జోలాలీ....

అయ్‌లాన్ ఆటపాటల్లో పడిపోయాడు. మిత్రులందరితో కలిసి గుజ్జన గూళ్లు కడుతున్నాడు. సముద్ర అలల్నే దుప్పటి కప్పి నిద్రపుచ్చుతున్నాడు. కాగితపు పడవలను విడిచి విడిచి అలసిన అయ్‌లాన్ మెత్తటి, చల్లటి ఇసుకనే పరుపుగా చేసుకుని సేద తీరుతున్నాడు. ఆటలన్నీ అయ్యాక రెక్కలు కట్టి ఇంటికి చేరి ప్రశాంతంగా గాఢ నిద్ర తీస్తున్నాడు. సిరియా శరణార్థి కుటుంబానికి చెందిన మూడేళ్ల చిన్నారి అయ్‌లాన్ మృతదేహం టర్కీ సముద్ర తీరానికి కొట్టుకొచ్చి వారాలు గడిచాయి. ఆ దృశ్యం చాలా మంది గుండెకు గాయం చేసింది. అయ్‌లాన్ గుర్తొచ్చినప్పుడల్లా ఆ గాయం రేగి సలుపుతూనే ఉంది. కానీ, పాలుగారే బుగ్గలతో ముద్దొచ్చే అయ్‌లాన్ ఎలా గుర్తుకువస్తే, సముద్రం ఒడ్డున ఎలా ఆటలాడితే ఆహ్లాదంగా ఉంటుందో వివరిస్తూ కొందరు కళాకారులు కార్టూన్లు గీశారు. వాటిని చూసి గాయపడిన గుండెలు సాంత్వన పొందుతున్నాయి. వాస్తవ ప్రపంచపు రాక్షసత్వాన్ని కళ్లకు కట్టినా అవే కుంచెలు ఊహా లోకపు గీతల్లో అయ్‌లాన్‌ను జోలలాడిస్తున్నాయి. రోదిస్తున్న హృదయాలకు ఓదార్పునిస్తున్నాయి. •



హిమ ఫ్రేములు

మంచు మొగ్గలు, గాజు పూలు, హిమ కళాఖండాల్ని జనించే పనిలో ప్రకృతి పరవశిస్తోంది. మంచు ముద్దలకు ముద్దులొలికే మహిమనిచ్చింది. అరవిరిసిన శ్వేత సుమాలు, దుప్పటి కప్పిన శ్వేత సౌధాలకు మనసు తుళ్లిపడేలా మంచు దండాన్ని మంత్రిస్తోంది. హిమ కౌగిలిలో ప్రకృతి కాంత మాయ చేస్తోంది. ఓ చోట మంచు ముద్దలు పూలలా కురిస్తే, మరో చోట పూలనే హత్తుకుని వాటి తాజాదనాన్ని బంధించాయి. ఇంకో చోట మోడుబారిన వృక్షానికి మంచు ఊడలైతే, అదే చోట ఇనుప కంచెకు హిమ లతల్ని అల్లింది. గాజు గోళాల్లా మారి అద్భుతాల్ని చిత్రిస్తే, పత్రాలను తాకి ముద్రలను అచ్చుతీసింది. మంచంటే అంతా పరుచుకుపోయే కన్నుపొడిచే తెల్లదనం కానేకాదు ఆ స్వచ్ఛమైన తెలుపులోను సప్తవర్ణాలను ప్రకాశించే చక్కదనమూ ఉందనీ ఈ చిత్రాలు చెబుతున్నాయి. వివిధ హిమ ప్రాంతాల్లో తీసిన ఈ చిత్రాలు కరిగిపోయే అద్భుతాల్ని ఫ్రేము కట్టి గుర్తునిలిపాయి. •